గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సి ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 101, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1 సోమవారం - 13 - మే - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## జైలుకు వెళ్లినా సీఎం పదవికి రాజీనామా ఎందుకు చేయలేదంటే.. కేజ్రీవాల్



ఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో జైలుకు వెళ్లినా సీఎం పోస్టుకు రాజీనామా చేయకపోవడంపై తాజాగా అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. సీఎం కుర్చీ నుంచి తనను తప్పించేందుకు బీజేపీ నేతలు కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగా తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపించారని, ఆ విషయం అర్థమైంది కాబట్టే తాను రిజైన్ చేయలేదని వివరించారు. తాను అరెస్టైన మిగతా..2లో

## మోడీ నామినేషన్ కి చంద్రబాబు !



అమరావతి : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ప్రధాని నరేంద్ర మోడీ నుంచి పిలుపు వచ్చింది. ఆయన ఈ నెల 13న ఏపీలో పోలింగ్ ముగిసిన వెంటనే 14న వారణాసి బయలు దేరి వెళ్లనున్నారు. ఈ నెల 14న వారా ణాసి లోక్ సభకు బీజేపీ తరపున అభ్యర్థిగా ప్రధాని నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కీలక సం దర్భాన్ని మిగతా..2లో

## ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించిన వికాస్ రాజ్



హైదరాబాద్ : తెలంగాణలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులోకి వచ్చిందని చెప్పారు. దాంతో కారణంగా నలుగురి కంటే ఎక్కువ మంది కలిసి ఉండొద్దన్నారు. 3.32కోట్ల మంది ఓటుహక్కు ఓటు వేసేలా 35,808 పోలింగ్ మిగతా..2లో

## ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు



- ఏపీలో రేపు ఎన్నికలు
- పొరుగు రాష్ట్రాల నుంచి సొంతూళ్లకు తరలి వస్తున్న ప్రజలు
- తగినన్ని బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారన్న నాదెండ్ల మనోహర్
- ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి

# వంద శాతం ప్రధాని పదవి రేసులో ఉన్నా.. కేసీఆర్

- ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ చేతిలోకి వెళ్లింది
- పట్టుమని మీ పార్టీకి పది సీట్లయినా వచ్చే అవకాశం లేదు
- టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్ గా మార్చడంతోనే ముచ్చి కాలం దాపురించింది
- కేసీఆర్ మానసిక స్థితి దెబ్బ తిందని రాజకీయ నిపుణులు




హైదరాబాద్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్లు సీఎంగా పనిచేశారు. పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. ప్రస్తుతం తెలంగాణ మిగతా..2లో

## పట్టణ ప్రాంత ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించే దిశగా కృషి చేస్తున్నాం




అమరావతి : దేశంలో రేపు (మే 13) నాలుగో దశ సార్వత్రిక ఎన్నికలు జరగనుండగా, ఏపీ లోనూ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల పోలింగ్ నిర్వహించ నున్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఏపీ సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా మీడియా తో మాట్లాడారు. మిగతా..2లో

## నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డిపై చర్యలకు ఈసీ ఆదేశం




అమరావతి : ఏపీలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఎన్నికల సంఘం తీవ్ర చర్యలు తీసుకుంటుంది . కొంతమంది విధుల నుంచి తప్పించగా మరికొందరిని బదిలి వేటు వేసింది. ఎన్నికల నిబం ధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ మిగతా..2లో

## ఓటరు ప్రభువు ఎవరిని కరుణిస్తే వారే రేపటి మారాజు




అమరావతి: ఒక్క రోజు ప్రభువుగా ఏపీ ఓటరు మారుతున్నాడు. ఓటరు ముందు ఎంతటి వారు అయినా ఇపుడు చేతులు చాచాల్సిందే. ఎంతటి బలమైన నాయకుడు అయినా అధినేత అయినా ఓటరు నిర్ణయం కోసం ఎదురు చూడాల్సిందే. చదువు కున్న వారు అయినా లేని వారు అయినా అపర కుబేరులు అయినా కడు బీద అయినా అందరికీ ఒక్కటే ఓటూ. అదే భారతీయ ప్రజాస్వామ్యం గొప్పదనం. ఆ ఓటు అనే ఆయుధంతో నేతల జాతకాలను మార్చేసే శక్తి అతి సామాన్యుడికి ఉంది. ఓటుతో అధినేత నుదుటి తలరాతను సైతం కొత్తగా రాసే అధికారం ఓటరు చేతిలో చేతలో ఉంది. ఓటరు ప్రభువు ఎవరిని కరుణిస్తే వారే రేపటి మారాజు అవుతాడు. వారే ఓటరు ప్రభువు తరపున కొత్త ప్రతినిధిగా జనం ముందుకు వస్తారు. భారతీయ ప్రజాస్వామ్యం గొప్పదనం ఏమిటి అంటే ఎంతో బలంగా ఉన్నాం అనుకున్న వారు కూడా ఓటమి మిగతా..2లో

## మల్కాజిగిరిలో బోణీ కొట్టేదెవరు?




హైదరాబాద్ : సార్వత్రిక ఎన్నికల రణరంగం చివరి అంకానికి చేరింది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అగ్రనేతలు నిన్నటి వరకు రాష్ట్రాన్ని చుట్టుముట్టారు. ఈ క్రమంలో ఏ నియోజకవర్గంలో ఓటరు నిర్ణయం ఎలా ఉండబోతున్నది అనేది ఉత్కంఠగా మారింది. కాగా రాష్ట్రంలో మినీ ఇండియాగా పిలువబడే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటర్ల నాడి ఏంటి? వారు ఇవ్వబోయే తీర్పు ఏంటి అనేదానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ హాట్ సీటును ఎలాగైనా తమ ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక్కడ ఈ మూడు పార్టీల్లో ఎవరు గెలిచినా తొలిసారి పార్లమెంట్ లోకి అడుగు పెట్టనున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఓటర్ల తీర్పు ఆసక్తిగా ఉండనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బీజేపీ తరపున మాజీమంత్రి ఈటల రాజేందర్ కోసం స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ మిగతా..2లో

# అంతర్జాతీయ మాతృదినోత్సవం

: అమ్మకు వందనం చేసిన ప్రముఖులు

- మే 12న అంతర్జాతీయ మాతృదినోత్సవం
- సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా విషెస్ వెల్లువ
- అమ్మ విశిష్టతను వివరించిన ప్రముఖులు

ఢిల్లీ : ఇవాళ అంతర్జాతీయ మాతృ దినోత్సవం. సృష్టిలో అత్యంత విలువైనది అమ్మ... అటువంటి అమ్మ విశిష్టతను ప్రస్తుతిస్తూ ప్రముఖులు మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

సృష్టిలో... మాటల్లో చెప్పలేని... అక్షరాలతో రాయలేని... అనంతమైన అనుభూతి... ఆకాశమంత అద్భుతం అమ్మ. అందరికీ మాతృదినోత్సవ శుభాకాంక్షలు.

టీడీపీ అధినేత చంద్రబాబు...

అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ప్రతి తల్లికీ వందనం. బిడ్డల భవిష్యత్ కోసం నిత్యం శ్రమించే అమ్మలకు పాదాభివందనం.

నారా లోకేశ్ (టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి)

హ్యాపీ మదర్స్ డే అమ్మా! నీ వాత్సల్యం, నీ కరుణ, నీ బలంతో నీ చుట్టూ ఉన్న ప్రతి అంశాన్ని శక్తిమంతం చేస్తావు. నువ్వు వెలుగుతూ మా జీవితాలను వెలిగిస్తున్నావు. అద్భుతమైన అమ్మగా ఉన్నందుకు థాంక్యూ అమ్మా!

వైఎస్ షర్మిల (ఏపీ పీసీసీ చీఫ్)

అమ్మ... చీకటిలో వెలుగు రేఖై, బాధలో బలానివై, అలసటలో ఆలనవై, విజయాల్లో ఆశీర్వాదానివై, దేవుడు నాకిచ్చిన అనిర్వచనీయమైన కానుక, నా ప్రాణం, నా ప్రేరణ, అమ్మ. హ్యాపీ మదర్స్ డే అమ్మా!

మెగాస్టార్ చిరంజీవి...

జన్మనిచ్చి, పెంచి, పోషించిన అమ్మకి ఈ ఒక్క రోజు ఏంటి... ప్రతి రోజూ






## నిశ్శబ్ద 'యుద్ధం'




అమరావతి : ఎన్నికల ప్రచారానికి ఈ సాయంత్రంతో తెర పడింది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈ సాయంత్రం 6 గంటల నుంచి మే12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు సైలెన్స్ పీరియడ్ గా భావిస్తారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి వీలులేదు. రోడ్ షో లు, సమావేశాలు, సోషల్ మీడియా ప్రచారాలు, పత్రికా ప్రకటనలు అన్నీ నేటితో ఆగిపోతాయి. బల్క్ ఎస్ఎంఎస్ లపై కూడా నిషేధం విధిస్తూ ఎన్నికల కమీషన్ ఆదేశాలు జారీచేసింది. స్థానికేతరులు సాయంత్రం 6 గంటల తర్వాత అయా నియోజకవర్గాల నుంచి వెళ్లిపోవాలి. తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలకు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ స్థానానికి ఉప ఎన్నికతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 175 శాసనసభ స్థానాలకు, 25 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో మొదలైన ఎన్నికల ప్రచారం దాదాపు 60 రోజుల తర్వాత ముగిసింది. మే 13వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో ఒకే రోజు పోలింగ్ జరగనుంది. మిగతా..2లో

# ఈ కొన్ని గంటలైనా నిజాయతీగా ఉండాలనే ఇంగిత జ్ఞానం జగన్ కి లేదు

- చంద్రబాబు పేరిట ఫేక్ వీడియో
- ఇంకొన్ని గంటల్లో పోలింగ్ మొదలవబోతోందన్న చంద్రబాబు
- తాను మాట్లాడిన ఈ వీడియో ఆధారంగానే ఫేక్ వీడియో రూపొందించారని ఆరోపణ
- వీటిని నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి



అమరావతి: తన పేరిట ఓ ఫేక్ వీడియో వైరల్ చేస్తున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబు వైసీపీ నాయకత్వంపై మండిపడ్డారు. ఇంకొన్ని గంటల్లో పోలింగ్ మొదలవబోతోందని, ఈ కొన్ని గంటలైనా నిజాయతీగా ఉండాలనే ఇంగిత జ్ఞానం జగన్ కు లేదని విమర్శించారు. ఆ జ్ఞానమే ఉంటే ఇలా కులమతాలను రెచ్చగొట్టే ఫేక్ వీడియోలను చేయించడని చంద్రబాబు స్పష్టం చేశారు. "వైసీపీ వాళ్లు సర్క్యులేట్ చేస్తున్న ఫేక్ వీడియోకి నేను మాట్లాడిన ఈ అసలు వీడియోనే ఆధారం. దీన్నే వాళ్లు ఫేక్ చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు జగన్ ఇలాంటి ఫేక్ వీడియోలు కుప్పలు తెప్పలుగా చేయిస్తాడు. వీటిని నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేయిస్తున్నా" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు. అంతేకాదు, ఒరిజినల్ వీడియో, ఫేక్ వీడియో క్లిప్పింగ్స్ ను కూడా ఆయన పంచుకున్నారు.

# నిశ్శబ్ద 'యుద్ధం'

మొదటి పేజి తరువాయి

ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి వీలులేదు. రోడ్ షో లు, సమావేశాలు, సోషల్ మీడియా ప్రచారాలు, పత్రికా ప్రకటనలు అన్నీ నేటితో ఆగిపోతాయి. బల్క్ ఎస్ఎంఎస్ లపై కూడా నిషేధం విధిస్తూ ఎన్నికల కమీషన్ ఆదేశాలు జారీచేసింది. స్థానికేతరులు సాయంత్రం 6 గంటల తర్వాత అయా నియోజకవర్గాల నుంచి వెళ్లిపోవాలి. తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలకు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ స్థానానికి ఉప ఎన్నికతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 175 శాసనసభ స్థానాలకు, 25 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో మొదలైన ఎన్నికల ప్రచారం దాదాపు 60 రోజుల తర్వాత ముగిసింది. మే 13వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో ఒకే రోజు పోలింగ్ జరగనుంది. రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని ఒక గంట పాటు సాయంత్రం 6.00 గంటల వరకు పొడిగించింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎన్నికల ఆంక్షలు ఇవీ : ఐదుగురికి మించి రోడ్డు పైకి రాకూడదు. మైక్రోఫోన్లు, స్పీకర్ల ద్వారా పాడటం, ప్రజలను ఉద్దేశించి మాట్లాడటం నిషేధం. బహిరంగ ప్రదేశాల్లో షామియానాలు, పందిరి వంటి నిర్మాణాలు అనుమతించరు. వ్యక్తులు, సంఘాల మధ్య ద్వేషాన్ని రెచ్చ గొట్టే ప్లకార్డులు, చిత్రాలు, సంకేతాలను ప్రదర్శించడం నిషేధం. కర్రలు, తుపాకులు, మారణాయుధాలతో కూడిన జెండాలను పోలింగ్ కేంద్రాల నుంచి కిలో మీటరు దూరం వరకు తీసుకెళ్ల కూడదు. ఆత్మ రక్షణ కోసం కర్రలు, తుపాకులు, మారణాయుధాలు వాడడాన్ని నిషేధం. మద్యం దుకాణాలు, బార్లు మూసి వేయాలి

## జైలుకు వెళ్లినా సీఎం పదవికి రాజీనామా ఎందుకు చేయలేదంటే.. కేజ్రీవాల్

మొదటి పేజి తరువాయి

సీఎం కుర్చీ నుంచి తనను తప్పించేందుకు బీజేపీ నేతలు కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగా తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపించారని, ఆ విషయం అర్థమైంది కాబట్టే తాను రిజైన్ చేయలేదని వివరించారు. తాను అరెస్టైన నాటి నుంచి బీజేపీ నేతలు తన రాజీనామాకు డిమాండ్ చేసిన విషయాన్ని కేజ్రీవాల్ గుర్తుచేశారు. ఈమేరకు శనివారం పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ ఈ వివరాలను వెల్లడించారు. 'సీఎం పోస్టు ముఖ్యం కాదు నాకు. కానీ పదవి నుంచి దింపేయడానికి నాపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపించడం చూసి వారి కుట్రలు సాగనివ్వొద్దనే ఉద్దేశంతోనే సీఎం పోస్టుకు రాజీనామా చేయలేదు. ప్రధాని నరేంద్ర మోదీ నిజంగానే అవినీతిపై పోరాడాలనుకుంటే కేజ్రీవాల్ ను చూసి నేర్చుకోవాలి. మా మంత్రులతో సహా అవినీతి నాయకులను మేం జైలుకు పంపించాం' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీని ఎలా అణగదొక్కాలో తెలియక పార్టీ కీలక నేతలు నలుగురిని ప్రధాని నరేంద్ర మోదీ జైలుకు పంపించారు. ఆప్ పై విసరడానికి రాళ్లు మిగలక పోవడంతో టాప్ లీడర్లను జైలుకు పంపి పార్టీని నామరూపాల్లేకుండా చేయాలని చూశారని ఆరోపించారు. అయితే, ఆప్ కేవలం పార్టీ కాదని, ఒక ఐడియాలజీ అని వివరించారు. ఆప్ ను ఎంతగా అణచివేయాలని ఆలోచిస్తే అంతగా పైకి ఎదుగుతుందని కేజ్రీవాల్ చెప్పారు. లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న సమయంలో తాను జైలు నుంచి బయటకు వస్తానని ఎవరూ ఊహించలేదని, అయితే, మీ అందరి ప్రార్థనల ఫలితంగానే తనకు బెయిల్ వచ్చిందని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

## మోడీ నామినేషన్ కి చంద్రబాబు !

మొదటి పేజి తరువాయి

ఈ నెల 14న వారాణాసి లోక్ సభకు బీజేపీ తరఫున అభ్యర్థిగా ప్రధాని నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కీలక సందర్భాన్ని పురస్కరించుకుని ఎన్డీయే భాగస్వాములు అందరికీ మోడీ వారణాసిని పిలిపించుకుంటున్నారు. అందరితో కలసి ఆయన తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. మోడీ ముచ్చటగా మూడోసారి వారణాసి నుంచి బీజేపీ తరఫున అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఆయన 2014లో తొలిసారి ఎంపీగా పోటీ చేశారు. అపుడే జాతీయ రాజకీయాల్లోకి వచ్చిన మోడీ గుజరాత్ లోని వడోదరా లోక్ సభ స్థానం నుంచి కూడా రెండవ సీటుగా ఎంచుకుని పోటీ చేశారు. వారణాసిలో 371,784 మెజారిటీ వచ్చింది. వడోదరాలో 570,128 మెజారిటీ వచ్చింది. అయినా మోడీ వారణాసిని ఉంచుకుని వడోదరాను వదిలేశారు. ఇక 2019లో మోడీకి వారణాసిలో 479,505 మెజారిటీ దక్కింది. ఈసారి కూడా అక్కడ నుంచే పోటీకి ఆయన సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా అట్టహాసంలొగా మోడీ నామినేషన్ ఘట్టం సాగనుంది. ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడానికి చంద్రబాబుని ఆహ్వానించారు. దీంతో ఈ నెల 14న చంద్రబాబు వారణాసికి బయలుదేరి వెళ్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాని మోడీ నామినేషన్ కార్యక్రమం అనంతరం అదే రోజున వారణాసిలో ఎన్?డీఏ కీలకసమావేశం జరగనుందని తెలుస్తోంది. . ఈ సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. ఇదిలా ఉంటే ఒక రోజు పర్యటన నిమిత్తం మే 14న ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయం నుంచి వారాణాసికి చంద్రబాబు బయలుదేరి వెళతారని తిరిగి అదే రోజు రాత్రికి విజయవాడకు చేరుకుంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించిన వికాస్ రాజ్

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులోకి వచ్చిందని చెప్పారు. దాంతో కారణంగా నలుగురి కంటే ఎక్కువ మంది కలిసి ఉండొద్దన్నారు. 3.32కోట్ల మంది ఓటుహక్కు ఓటు వేసేలా 35,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం నగరంలోని యాకుత్‌పురా డీఆర్సీ కేంద్రాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సందర్శించారు. ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.

## పట్టణ ప్రాంత ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించే దిశగా కృషి చేస్తున్నాం

మొదటి పేజి తరువాయి

దీనిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఏపీ సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా మీడియా తో మాట్లాడారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లను అడ్డుకోవాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రేపటి పోలింగ్ నేపథ్యంలో, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ ఎండీతో మాట్లాడామని వెల్లడించారు. ఏపీలో హింసకు తావులేని రీతిలో, రీ పోలింగ్ అవసరం రాని విధంగా ఎన్నికలు జరపాలన్నదే తమ లక్ష్యం అని ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. పట్టణ ప్రాంత ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. 100 శాతం పోలింగ్ నమోదయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈసారి ఎన్నికల కోసం గతంలో ఎప్పుడూ లేనంతగా పోలీస్ పరిశీలకులను, సాధారణ పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించిందని... ఎన్నికల బందోబస్తు కోసం కర్ణాటక, తమిళనాడు పోలీసు బలగాలతో పాటు కేంద్ర బలగాలను కూడా రప్పించామని ఏపీ సీఈవో ముఖేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఎక్కడా హింసాత్మక ఘటనలకు అవకాశం ఇవ్వకూడదని జిల్లా ఎస్పీలకు ఈసీ స్పష్టం చేసిందని పేర్కొన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటామని, పోలింగ్ కేంద్రాల్లో లోపల, బయట వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రత్యేక యాప్ (పోల్ డేటా మానిటరింగ్ యాప్)ను తీసుకువచ్చామని వెల్లడించారు. రేపటి పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈ రాత్రి 7 గంటలకల్లా ఎన్నికల సిబ్బంది అందరూ తమకు కేటాయించిన పోలింగ్ బూత్ లకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

## నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డిపై చర్యలకు ఈసీ ఆదేశం

మొదటి పేజి తరువాయి

కొంతమంది విధుల నుంచి తప్పించగా మరికొందరిని బదిలి వేటు వేసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలున్నాయి. ఈ ఆదేశాల అమలులో నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డి కోడ్ అమలులో విఫలమయ్యారంటూ అతనిపై చర్యలకు ఈసీ ఉపక్రమించింది. ఎన్నికల కోడ్ అమల్లో విఫమయినందున అభియోగాలు మోపాలని ఈసీ ఆదేశించింది. అదేవిధంగా ఎస్‌డీపీవో రవీంద్రనాథ్‌రెడ్డి, సీఐ రాజారెడ్డిపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. 144 సెక్షన్ అమలులో ఉన్నా బందోబస్తు ఏర్పాట్లు సరిగా చేయకపోవడంపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ముగ్గురిపైనా శాఖాపరమైన విచారణ చేపట్టాలని, తీసుకున్న చర్యలపై రాత్రి 7 గంటలలోగా నివేదికను పంపాలని డీజీపీని ఆదేశించింది. తిరుపతికి చెందిన ఐదుగురు సీఐలు అధికార వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో ఈసీ వారిని అనంతపురం జిల్లాకు బదిలి చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నంద్యాలలో పర్యటించిన విషయం తెలిసిందే. అధికారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రారెడ్డికి ఆయన మద్దతు పలికారు. అనుమతి లేకుండా జనసమీకరణ జరిపారంటూ అభ్యర్థి రవితో పాటు అల్లు అర్జున్‌పై సైతం కేసు నమోదైంది. అయితే, ఈ వ్యవహారం తాజాగా పోలీసులకు చుట్టుకున్నది. నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో విఫలమయ్యారని, ఆయనపై అభియోగాలను నమోదు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అలాగే, ఎస్డీపీవో రవీంద్రనాథ్ రెడ్డి, సీఐ రాజారెడ్డిపై డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీ జరిపించాలని డీజీపీకి ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డి స్నేహితులు. తన స్నేహితుడికి మద్దతు పలికేందుకు పుష్ప స్టార్ తన భార్యతో కలిసి శనివారం నంద్యాలలో పర్యటించారు. నంద్యాల శివారులో అల్లు అర్జున్‌కు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పెద్ద ఎత్తున కార్లు, బైక్‌లతో ర్యాలీ తీశారు. అయితే, పర్యటనకు ముందస్తు అనుమతి లేదని.. అయినా భారీగా బందోబస్తు కల్పించారంటూ ఎన్నికల కమిషన్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. దాంతో ఈ వ్యవహారంపై ఈసీ చర్యలకు ఆదేశించింది.

# మూడు ముక్కల తిక్కలోడు మూడు రాజధానులు చేసేశాడంట!

మొదటి పేజి తరువాయి



ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ చేతిలోకి వెళ్లింది. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. గతంలో టీఆర్ఎస్ గా ఉన్న పార్టీని బీఆర్ఎస్ గా మార్చారు. జాతీయ రాజకీయాలను శాసిస్తానని కంకణం కట్టుకున్నారు. కానీ చివరకు రాష్ట్రంలోనే ఓటమి పాలయ్యారు. ఇప్పుడు మళ్లీ జాతీయ రాజకీయాల్లో సత్తా చాటుతానని ప్రతిన బూనుతున్నారు. అవకాశం వస్తే ప్రధాని రేసులో తాను ఉంటానని చెబుతున్నారు. ఆశకైనా ఓ అంతు ఉండాలి. రాష్ట్రంలోనే రెండంకెల సీట్లు రావడం కష్టంగా ఉన్న ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తానని చెప్పడం వింతగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. పట్టుమని మీ పార్టీకి పది సీట్లయినా వచ్చే అవకాశం లేదు. ఒకటి రెండు వస్తే ఎక్కువ అంటున్నారు. ఈనేపథ్యంలో తాను కూడా ప్రధాని రేసులో ఉన్నానని చెప్పడం దేనికి సంకేతం అంటున్నారు. పిచ్చి ముదిరింది రోకలి తలకు చుట్టండి అన్నట్లు గా ఉందంటున్నారు. కేసీఆర్ మానసిక స్థితి దెబ్బ తిందని రాజకీయ నిపుణులు సూచిస్తున్నారు. గతంలోనే జాతీయ రాజకీయాల్లో కీ రోల్ పోషిస్తానని బయలుదేరి చేయి కాల్చుకుని మరీ ఇప్పుడు ఇలాంటి మాటలు మాట్లాడటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్ గా మార్చడంతోనే ముచ్చి కాలం దాపురించిందని అంటున్నారు. ఇప్పుడు ప్రధాని పదవి రేసులో తాను కూడా ఉన్నానని చెప్పడంతో అందరు కంగుతింటున్నారు. ఏం చూసుకుని కేసీఆర్ ఇలా మాట్లాడుతున్నారు. ఏ ధైర్యంతో ప్రధాని రేసులో ఉంటున్నానని చెబుతున్నారు. కేసీఆర్ మాటలకు అర్థమేమిటి? ఆధారాలేమిటి? ఇండియా కూటమిలో భాగస్వామి కూడా కాలేదు. కానీ ప్రధాని పదవి ఆశిస్తున్నట్లు చెప్పడం పలు సందేహాలకు తావిస్తోంది.

# ఓటరు ప్రభువు ఎవరిని కరుణిస్తే వారే రేపటి మారాజు

మొదటి పేజి తరువాయి

ఎంతటి బలమైన నాయకుడు అయినా అధినేత అయినా ఓటరు నిర్ణయం కోసం ఎదురు చూడాల్సిందే. చదువు కున్న వారు అయినా లేని వారు అయినా అపర కుబేరులు అయినా కడు బీద అయినా అందరికీ ఒక్కటే ఓటూ. అదే భారతీయ ప్రజాస్వామ్యం గొప్పదనం. ఆ ఓటు అనే ఆయుధంతో నేతల జాతకాలను మార్చేసే శక్తి అతి సామాన్యుడికి ఉంది. ఓటుతో అధినేత నుదుటి తలరాతను సైతం కొత్తగా రాసే అధికారం ఓటరు చేతిలో చేతలో ఉంది. ఓటరు ప్రభువు ఎవరిని కరుణిస్తే వారే రేపటి మారాజు అవుతాడు. వారే ఓటరు ప్రభువు తరఫున కొత్త ప్రతినిధిగా జనం ముందుకు వస్తారు. భారతీయ ప్రజాస్వామ్యం గొప్పదనం ఏమిటి అంటే ఎంతో బలంగా ఉన్నాం అనుకున్న వారు కూడా ఓటమి పాలు అయ్యారు. తమకు తిరుగులేదు అనుకున్న వారిని సైతం ఇంటికి పంపించేసే శక్తి ఓటర్లకు పుష్కలంగా ఉంది. చదువు సంగతి పక్కన పెడితే భారతీయ ఓటరు ఆలోచన వివేచన ముందు ఎవరూ పనికి రారు అన్నది అక్షర సత్యం. వారు ఎపుడూ తప్పు చేయరు. ఓటు వేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి మాత్రమే వేస్తారు. అది తమకు రానున్న అయిదేళ్ల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకునే వేస్తారు. తాయిలాలు ఇచ్చారనో లేక తమకు సన్నిహితులు దగ్గర వారు అనో ఎలాంటి వివక్ష తీర్పులో ఎక్కడా చూపించరు. అందుకే ఎప్పటికపుడు విలక్షమైన సలక్షణమైన తీర్పులు వెలువడుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే విభజన ఏపీలో రెండు ఎన్నికలను చూసిన ఏపీ ఓటర్లు ముచ్చటగా మూడవ ఎన్నిక చూస్తున్నారు. మూడవసారి తీర్పు ఇచ్చేందుకు వారు సంసిద్ధమవుతున్నారు. ఏపీలో ఈసారి ఎవరికి గద్దెను అప్పగించాలి అన్నది వారు ఎన్నో ఆలోచించి నిర్ణయం తీసుకోబోతున్నారు. పోలింగ్ కి గంటల వ్యవధి వచ్చేసింది. ఆదివారం ఆగితే చాలు. ఏపీలో పోలింగ్ స్టార్ట్ అయిపోతుంది. సోమవారం ఉదయం ఏడు నుంచి పోలింగ్ స్టార్ట్ అవుతుంది. సాయంత్రం ఆరు వరకూ సాగుతుంది. అంటే ఏకంగా 11 గంటల సుదీర్ఘ సమయం అన్న మాట. అంతటితో కాదు. ఆరు గంటలకు పోలింగ్ బూత్ కి వచ్చినా కూడా క్యూలో ఉన్న వారిని అందరినీ ఓటు వేయిస్తారు. అలా రాత్రి ఎంత వేళ అయినా చివరి ఓటరు ఓటు వేసేవరకూ పోలింగ్ సాగుతుంది. మొత్తం మీద చూస్తే ఏపీలో ఓటర్లకు ఇపుడు అగ్ని పరీక్ష ఉంది. ఒకటి అధికారంలో ఉన్న పార్టీ. రెండవది అధికారంలోకి వస్తామమి అంటున్న పార్టీ ఈ రెండు పార్టీలను ఏపీ ప్రజలు చూసారు. రెండు ప్రభుత్వాలను చూశారు. ఇపుడు వారికి ఈ రెండు ప్రభుత్వాలలో దేనిని మళ్ళీ కొనసాగించాలన్నదే ముందున్న ప్రశ్న. దానికి ధీటైన జవాబు ఓటు రూపంలో జనాలు ఇవ్వబోతున్నారు ఏపీలో ఎంపీతో పాటు ఎమ్మెల్యే సీట్లకూ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎంతో చైతన్యవంతమైన రాష్ట్రంగా ఏపీకి పేరు ఉంది. రాజకీయంగా ఓటర్లు ఎంతో




అవగాహన ఉన్న వారు కావడం విశేషం. ఏపీలో ఏ రకమైన తీర్పు ఇస్తారు అన్నది దేశమంతా చూస్తోంది. మొత్తం మీద చూస్తే కనుక ఏపీలో ఓటర్ల చేతిలో బంది ఉంది. అన్ని రాజకీయ పార్టీలు తమ విన్నపాలను ముందుంచాయి. ప్రతీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్ధులు తమ అర్జీలను ఓటర్ల ముందు ఉంచారు. ఒక పెద్ద మాస్టారుగా పార్టీలకు అభ్యర్ధులకు మార్కులు వేయాలి. ఎవరు సమర్ధులో ఎవరికి అందలం అందించాలో కూడా ఓటర్లు ఇపుడు తీర్పు చెప్పాలి. మొత్తానికి అందరి చూపూ ఏపీ ఓటర్ల మీద ఉంది. చూడాలి మరి ఏ విలక్షణ తీర్పు వస్తుందో.

# మల్కాజిగిరిలో బోణీ కొట్టేదెవరు?

మొదటి పేజి తరువాయి




ఈ క్రమంలో ఏ నియోజకవర్గంలో ఓటరు నిర్ణయం ఎలా ఉండబోతున్నది అనేది ఉత్కంఠగా మారింది. కాగా రాష్ట్రంలో మినీ ఇండియాగా పిలువబడే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటర్ల నాడి ఏంటి? వారు ఇవ్వబోయే తీర్పు ఏంటి అనేదానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ హాట్ సీటును ఎలాగైనా తమ ఖాతాలో వేసుకు నేందుకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక్కడ ఈ మూడు పార్టీల్లో ఎవరు గెలిచినా తొలిసారి పార్లమెంట్ లోకి అడుగు పెట్టనున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఓటర్ల తీర్పు ఆసక్తిగా ఉండనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బీజేపీ తరఫున మాజీమంత్రి ఈటల రాజేందర్ కోసం స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ రంగంలోకి దిగి రోడ్ షో నిర్వహించడం, సర్వే సంస్థలు ఈటలకే మొగ్గు చూపుతుండటంతో పాటు కులసంఘాలు సైతం ఆయనకే జై కొట్టడంతో మాల్కాజిగిరి పొలిటికల్ సినారియో మరింత రసవత్తరంగా మారింది.

ఈటల వ్యూహాత్మక వైఖరి..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మల్కాజిగిరిని తన యుద్ధక్షేత్రంగా ఎంచుకున్న ఈటల రాజేందర్ మొదటి నుంచి ఇక్కడ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఒక్కసారైనా బీజేపీ గెలవని స్థానంలో ఆత్మవిశ్వాసంతో అడుగులు వేశారు. బీజేపీ జాతీయ నాయకత్వం అండగా నిలబడటం, స్వయంగా మోడీ నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించడంతో సీన్ మొత్తం మారిపోయింది. రాజేంద్రుడి కోసం నరేంద్రుడే వచ్చాడనే టాక్ ప్రజల్లో సానుకూల చర్చకు దారితీసింది. మరోవైపు ఉద్యమకారుడిగా, మంత్రిగా ఈటలకు ఉన్న పరిచయాలు, ప్రచారంలో ప్రత్యర్థుల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టి ఓటర్లను కన్విన్స్ చేయగలిగారనే చర్చ జరుగుతోంది. కొవిడ్ సమయంలో ఆయన సేవలు, కేంద్రంలో మోడీ చరిష్మా కలగలిపి ప్రత్యర్థులను ఇరుకున పెడుతూ ప్రచారంలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలవడంలో ఈటల సక్సెస్ అయ్యారు. ఈక్రమంలోనే పీపుల్స్ పల్స్ సర్వే, 26 స్ట్రాటజీస్ సర్వే సంస్థలు సైతం మల్కాజిగిరిలో ఈటల 46.79 శాతం ఓటు షేరుతో బంపర్ విక్టరీ సాధిచబోతున్నారని అంచనా వేశాయి.

ఎవరి ధీమా వారిదే..

ఇక్కడ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కసారి కూడా గెలవకపోగా సిట్టింగ్ స్థానంలో ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సునీత మహేందర్ రెడ్డిని బరిలోకి దింపింది. అధికార పార్టీ హోదా తమకు సానుకూలంగా మారుతుందనే ఆశాభావంతో ఉంది. బీఆర్ఎస్ ఇక్కడ తొలిసారి బోణీ కొట్టి క్లిష్టపరిస్థితుల్లో తన ఉనికిని కాపాడుకోవాలని చూస్తోంది. సెగ్మెంట్ పరిధిలో అందరూ తమ ఎమ్మెల్యేలు ఉండటంతో కలిసి వస్తుందని బీఆఆర్ఎస్ ధీమాతో ఉంది. మరోవైపు ఇక్కడ ఎయిర్ ఫోర్స్, ఆర్మీ స్థావరాలతోపాటు పారిశ్రామిక, విద్యా రంగాలకు సంబంధించిన ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలు ఉన్నాయి. రైల్వే, మిలిటరీ ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఉన్నారు. వీరి సమస్యలు కేంద్రం పరిధిలో ఉంటాయని, బీజేపీని గెలిపిస్తే వాటి పరిష్కారం సాధ్యమనే చర్చ కూడా జరుగుతోంది. దీంతో గెలుపు విషయంలో ఓటర్ల అంతిమ తీర్పు ఎలా ఉండబోతున్నది అనేది ఆసక్తిగా మారింది.

## ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు

అమరావతి : ఏపీలో మే 13 (సోమవారం) నాడు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, సొంతూళ్లలో ఓటు వేసేందుకు ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారు ఏపీకి తరలి వస్తున్నారు. అయితే, వారు తమ స్వస్థలాలకు చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారంటూ జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ధ్వజమెత్తారు. సీఎం జగన్ సభలకు ఉరుకులు పరుగులు పెడుతూ బస్సులు సమకూర్చే ఆర్టీసీ అధికారులు, సాధారణ ప్రయాణికుల సమస్యలను ఎందుకు పట్టించుకోరని నిలదీశారు. ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాల్లో ఎంతోమంది ఏపీ వాసులు ఉన్నారని, వారందరూ ఇప్పుడు ఓటు వేసేందుకు ఏపీకి వస్తున్నారని నాదెండ్ల వెల్లడించారు. అయితే వారు తమ సొంతూళ్లకు వెళ్లేందుకు అవసరమైన బస్సులను ఏర్పాటు చేయడం ఆర్టీసీ కనీస బాధ్యత అని, కానీ ఈ విషయాన్ని విస్మరించి తగిన బస్సులు ఏర్పాటు చేయకుండా వారిని ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని నాదెండ్ల విమర్శించారు.

ఓటు వేసేందుకు సొంత రాష్ట్రానికి వస్తున్న ప్రజల ఇబ్బందులపై ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని, ప్రయాణికులకు తగిన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు వేసేందుకు విశాఖ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు వంటి నగరాలకు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వస్తున్న ప్రజల ఇబ్బందులు జనసేన దృష్టికి వచ్చాయని నాదెండ్ల పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ తగినన్ని బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణలో వాన బీభత్సం... తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



హైదరాబాద్ : తెలంగాణలోని పలు జిల్లాల్లో నేడు వర్ష బీభత్సం నెలకొంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాలో గాలివానతో తీవ్ర నష్టం చోటుచేసుకుంది. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, భారీ వర్షం అతలాకుతలం చేశాయి. గాలులకు టార్పాలిన్ పట్టలు లేచిపోగా, భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయింది. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలి రామోజీపల్లి శివారులో వరిధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో పిడుగు పడింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించారు. శ్రీరాములు, శివరాజు తాతామనవడు అని తెలుస్తోంది. అటు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మలోనూ పిడుగు పడింది. ఐదుగురికి గాయాలు కాగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులను రిమ్స్ కు తరలించారు. ఆసిఫాబాద్ లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బంది ఇబ్బందిపడ్డారు. కాగా, తెలంగాణలో మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మహబూబ్ నగర్, హైదరాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వివరించింది. వర్షాలకు ధాన్యం తడిసిపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన తెలంగాణలోని పలు జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుండడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతే రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందడంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. తెలంగాణకు మరో ఐదు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందున జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## ఓటరు మహాశయులారా... ఇలా కూడా మోసం చేస్తారు జాగ్రత్త!

అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకొని దుర్మార్గాన్ని తరిమికొట్టి రాష్ట్ర భవిష్యత్ లో భాగస్వామ్యం కావాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్లరామయ్య పిలుపునిచ్చారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్ ఓటర్ల చేతుల్లో ఉందని అన్నారు. ఎండకు, వానకు భయపడకుండా ప్రజలు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో పట్టణ ప్రాంతాలు హైదరాబాద్, బెంగుళూరులాంటి సిటీల్లో 40% పోలింగ్ మాత్రమే నమోదైందని, మన రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పట్టణ, పల్లె ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకొని రాష్ట్ర ఉన్నతికి సహకరించాలని వర్ల రామయ్య కోరారు. 90 శాతం పోలింగ్ దాటేలా ఓటర్లు తమ పవిత్రమైన ఓటును వినియోగించుకోవాలని అన్నారు. ఉదయం 7 గంటల నుండి 11 గంటల్లోపు అధిక శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఇంకు పూసినా, ఇంకేది చేసినా ఓటు హక్కును హరించలేరు కొంత మంది దుర్మార్గపు ఆలోచనలు, దొంగ ఫోటోలతో మోసం చేస్తారు... మోసపోకండి. ఓటును హక్కుగా భావించండి. మీ హక్కును ఓటుగా బూత్ లో వేయండి. మిమ్మల్ని ఓటు వేయనివ్వకుండా ఇళ్ల వద్దనే ఇంకు పూసినా... ఇంకేది చేసినా పోలింగ్ బూత్ కు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోండి. వీళ్లు దొంగ ఇంకు పూసినంత మాత్రాన మీ ఓటు హక్కు హరించలేరు. మీరు వెళ్లేటప్పటికే మీ ఓటును ఎవరైనా వేస్తే ఛాలెంజ్ ఓటు అడిగి తీసుకుని మీ ఓటు హక్కును వినియోగించుకోండి. అప్పటికే మీ ఓటును ఎవరైనా వేశారని అధికారి చెబితే మీయి టెండర్ ఓటు హక్కును కూడా వినియోగించుకోవచ్చు. మీ ఓటును దుర్మార్గుల చేతికి వెళ్లనివ్వకండి ఓటు వేయకుండా అపవిత్రం చేయకండి... దుర్మార్గుల చేతికి మీ ఓటును వెళ్లనివ్వకండి. ఎన్నికల కమిషన్ ఓటర్లకు మౌళిక సదుపాయాలు కల్పించాలి. అవసరమైన వారికి సహాయకులను ఏర్పాటు చేయాలి. వర్షం పడితే ఓటర్లు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలి. దివ్యాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయాలి. ఓటు వేసేటప్పుడు పోలింగ్ అధికారుల సహాయం తీసుకునే ముందు తగు జాగ్రత్తలు ఓటర్లు తీసుకోవాలి. దళితుడిపై దాడి చేసిన కోన వెంకట్ ను అరెస్ట్ చేయాలి నేడు అంతర్జాతీయ తల్లుల దినోత్సవం సందర్భంగా మన రాష్ట్రంలో ఓ తల్లి ఆక్రందన, ఆవేదన, ఆత్మఘోష రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలి. బాపట్లలో దళితుడ్ని కొట్టిన కోన వెంకట్, ఎస్సై జనార్దన్ లను వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలి. దుర్మార్గాన్ని అరికట్టాలి. పోలింగ్ శాతాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

## ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న ఎన్నికల సిబ్బంది

### ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నేడు ఎన్నికలు

### ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

### ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద సందడి

అమరావతి : ఏపీలో నేడు (మే 13) 175 అసెంబ్లీ స్థానాలకు, 25 లోక్ సభ స్థానాలకు... తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈవీఎంలు, తదితర ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసేందుకు నిర్దేశించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి తమకు కేటాయించిన ఈవీఎంలు, తదితర సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలకు పయనమవుతున్నారు. కాగా, సెక్టార్ ల వారీగా సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించారు. పోలింగ్ వేళ అనుసరించాల్సిన విధివిధానాలను అధికారులు సిబ్బందికి వివరించారు. ఇప్పటికే వారికి ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు.

# కేంద్ర బలగాల మధ్య పోలింగ్!!

## పోలింగ్ బూతులకు చేరుకున్న సామాగ్రి సిబ్బంది!!





నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్ ):** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరిగే ఉత్కంఠ భరితమైన దేశ భవిష్యత్తు దిక్సూచి లాంటి ఎన్నికలకు కేంద్ర పారా



మిలటరీ బలగాలు గ్రామాలకు చేరుకున్నాయి, కేంద్ర బలగాలతో పాటు స్థానిక సివిల్ పోలీసులు పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి నాగర్ కర్నూల్, పార్లమెంటు స్థానంతో



పాటు మహబూబ్నగర్ పార్లమెంటు స్థానంలో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి, ముఖ్యంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అచ్చంపేట ,కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజక వర్గాలు నల్లమల్ల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడం వల్ల ఆయా నియోజకవర్గం పరిధిలోని గ్రామాలలో పోలీసులు పటిష్టంగా కేంద్ర బలగాల సహకారంతో పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు, గతంలో మావోయిస్టులకు పుట్టిన పేరుగా పేరుపొందిన ఈ ప్రాంతం పోలీసుల కన్ను సయ్యల్లో కి వెళ్లిపోయింది, ఇప్పటికే పోలీసులు నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సమస్యత్మక గ్రామాలతో పాటు నేర చరిత్ర కలిగిన వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం గతంలో నేరచరిత్ర కలిగిన వ్యక్తుల ప్రత్యేక దృష్టి పెట్టారు, ముఖ్యంగా కొల్లాపూర్ నియోజక వర్గంలోని కోడేరు, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండలంలోని వివిధ సమస్యత్మక గ్రామాల్లో నాగర్ కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాస్ యాదవ్ గత అనుభవం దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎస్సైలతో సర్కిల్ ఇన్స్పెక్టర్ సహకారంతో ఆయన పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుతుండా పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డిఎస్పి శ్రీనివాస్ యాదవ్ కోరారు,

# శ్రీ భూదేవి శ్రీదేవి సమేత చిట్యాల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13 వ వార్షిక బ్రహ్మోత్సవాల



నందిగామ (**గౌతమ్ న్యూస్ ):** మూడోరోజు సాయంత్రం పూట కోలాటం ప్రోగ్రాం మణికంఠ





కోలాటం బృందాం పాల్గొనరు మణికంఠ మాస్టర్ నాగలక్ష్మి లీడర్ టీమ్ పాల్గొనరు దేవాలయ ప్రాంగణంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ శ్రీనివాసుడు గోవిందుని కృపకు మనమందరం పాత్రులు కాగలరని కోరుతూ మీ శ్రేయోభిలాషి మణికంఠ మాస్టర్

# జిల్లా ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (**గౌతమ్ న్యూస్ ):** నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా భద్రతాపరమైన అన్ని రకాల చర్యలను పూర్తి చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ వెల్లడించారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 2500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.రేపు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 971 పోలింగ్ కేంద్రాలలో జరగబోయే ఓటింగ్లో ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు,ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు,మంటను ప్రేరేపించే వస్తువులకు అనుమతి లేదని, ప్రజలంతా ఇట్టి విషయాన్ని గమనించాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ ను ఖచ్చితంగా అమలయ్యే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలియజేశారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పోలింగ్ కేంద్రాలలో గానీ,పరిసర ప్రాంతాల్లో గానీ ఓటర్లను ప్రలోభ పెట్టె వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు,మద్యం మరియు ఇతరత్రా వస్తువులను ఎవరైనా పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి గానీ,సీ-విజిల్ యాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేసి సమాచారం అందజేయాలని కోరారు.పోలింగ్ కేంద్రాల నుండి 100 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదని,ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలను అతిక్రమిస్తే అట్టి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.కావున ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే పోలింగ్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో గౌడ అభ్యర్థులకు మోకుదెబ్బ మద్దతు



**అనంతుల రమేష్ గౌడ్**

హైదరాబాద్(**గౌతమ్ న్యూస్ ):** పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే గౌడ అభ్యర్థులకు గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నదని స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానల్లో డా. బూర నర్సయ్య గౌడ్, తీగుల్ల పద్మారావు గౌడ్ లు పోటీ చేస్తున్నారని రమేష్ గౌడ్ తెలిపారు. నర్సయ్య గౌడ్, పద్మారావు గౌడ్ ల గెలుపు కోసం గౌడ కులస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలను కలుపుకొని పోవాలని రమేష్ గౌడ్ సూచించారు. గౌడ అభ్యర్థులను రాజకీయాలకు అతీతంగా గౌడ కులస్థులు ఓటు వేసి గెలిపించాలని మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ తరపున రమేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# కొల్లాపూర్ మామిడి కి భలే డిమాండ్!!

## రుచిలో నెంబర్ వన్!! ఎగబడుతున్న వినియోగదారులు!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్ ):** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కొల్లాపూర్ మామిడికి మార్కెట్లో భలే డిమాండ్ పెరుగుతుంది, గత రెండు మూడు నెలల క్రితం నట్టేట మునిగిన మామిడి రైతులు నకిలీ క్రిమిసంహారక మందులు పిచికారి చేయడం వల్ల మామిడి తోట లు పూత దశలో రాలిపోవడం వల్ల తీవ్ర నష్టం వాటిలిందని దీనివల్ల రైతాంగం మామిడి తోటలను నరికి



వేసుకున్నారు, అయినా కొన్నిచోట్ల కొల్లాపూర్ నియోజక వర్గంలోని పెద్దకొత్తపల్లి ,కోడేరు , కొల్లాపూర్ మండలాలలో మామిడి రైతులు అప్పులు చేసి మామిడి పంటను కొంతమేర నష్టపోకుండా కాపాడుకున్నారు, ప్రస్తుతం మామిడి పండ్లు కొల్లాపూర్ మార్కెట్లో కిటకిటలాడుతున్నాయి, కొల్లాపూర్ మామిడి పండ్ల కోసం ఇతర ప్రదేశాల నుంచి హైదరాబాదు నుంచి, కర్నూల్ రాయచూర్, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వినియోగదారులు మామిడిపండ్ల కొనుగోలు చేయడానికి కొల్లాపూర్ కు తరలివస్తున్నారు, కొల్లాపూర్ కొత్త బస్టాండ్ ప్రాంతంలో మామిడిపండ్ల వ్యాపారస్తులు తమ తమ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు, ఎక్కడ చూసినా కొల్లాపూర్ లో మామిడి పండ్ల వ్యాపారం కనిపిస్తుంది, కేజీల కొద్ది వినియోగదారులు కార్లు, జీపులు తీసుకొచ్చి మామిడి పండ్లను బుట్టల్లో తరలించకపోతున్నారు, కొల్లాపూర్ నియోజక వర్గంలో మామిడి తోటలు ప్రపంచ ప్రఖ్యాతిగాంచినప్పటికీ కొన్ని కొన్ని కారణాలవల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మామిడి రైతులు తీవ్ర నష్టాల గురవుతున్నారు, ప్రస్తుతం కొల్లాపూర్ మార్కెట్లో బెనిష, రసాలు, కేసరి మామిడిపండ్లకు ఫుల్ డిమాండ్ ఉంది, అద్భుత రుచితో ఉంటున్న కేసరి మామిడి పండ్లకు వినియోగదారులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు, మొత్తం మీద మామిడి సీజన్ కొన్ని రోజుల్లో పూర్తి అవుతున్న సందర్భంలో సీజనల్ లో దొరికే ఆరోగ్యానికి జీర్ణాశయానికి, ఎంతో ఉపయోగపడే మామిడి పండ్లకు ప్రజలు ఎగబడుతున్నారు, కొల్లాపూర్ ప్రాంతంలో ప్రజలు వాళ్ల వాళ్ల బంధువులకు వందల కిలోల వరకు మామిడి పండ్లను కొనుగోలు చేసి ఉచితంగా ఇస్తున్నప్పటికీ ఏమి తెలియని వాళ్ళు ప్రత్యేకంగా కొల్లాపూర్ వచ్చి మామిడి పండ్లను కొనుగోలు చేసుకుని పోతున్నారు, ప్రస్తుతం కేజీ మామిడి పండ్ల ధర 40 రూపాయల నుంచి 50 రూపాయల మధ్య ఉంది, అయినా ఇంత తక్కువ ధర కు కొల్లాపూర్ మామిడిపండ్లు రుచికరంగా ఉండడం అందరికీ తెలిసిన విషయమే



వచ్చే సంవత్సరం మామిడి రైతుల కష్టాలను ప్రభుత్వాలు పరిష్కరించాలని పలువురు మామిడి తోటల రైతులు డిమాండ్ చేస్తున్నారు,

# పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం సందర్శించిన

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ ):** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదివారం పరిశీలించారు. కొత్తగూడెం నియోజకవర్గానికి సంబంధించి 253 పోలింగ్ కేంద్రాలకు గాను శ్రీ రామచంద్ర డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలోని 253 పోలింగ్ కేంద్రాలకు గాను 1212 మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించామని, దానిలో పిఓలు 303, ఏపీవోలు 303 మరియు ఓపిఓలు 606 మందిని ఎన్నికల విధులు నిర్వహించుటకు గాను కేటాయించామని తెలిపారు. సామాగ్రి మరియు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేర్చుటకు గాను 49 బస్సులను అందుబాటులో ఉంచామని, అదనంగా 3 బస్సులను అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుండి ఎన్నికల సిబ్బందికి సామాగ్రి పంపిణీ చేపట్టామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పించామని ఆమె తెలిపారు. త్రాగునీరు,వైద్య శిబిరం,అల్పాహారం, భోజన వసతి షామీయానాలు ఇతర వస్తువులు ఏర్పాటు చేయగా,పిఓలు ఏపీవోలు ఓపిఓలతో కూడిన బృందాలని హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా



తీశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పక్కగా అందించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది సరిచూసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్దకు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలాగా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన మా దృష్టికి తేవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషు, తాసిల్దార్ పుల్లయ్య, చుంచుపల్లి డిప్యూటీ తాసిల్దార్, మరియు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల భవిష్యత్తు కోసం అరగంట కేటాయించి !

# నీఅమూల్యమైన ఓటు వేసేయ్!!

## సమాచార హక్కు మండల కన్వీనర్ ఆర్ నాగేష్.



నర్సాపూర్(**గౌతమ్ న్యూస్ ):** ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు చాలా విలువైనది. దేశ భవిష్యత్తుకు, ప్రజాస్వామ్యానికి పునాది ఓటు. ఓటు హక్కు పౌరుడి అస్తిత్వానికి ప్రతిక. దేశ స్థితి గతులను మార్చే శక్తి ఓటుకు ఉంది. ఓటు అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుంది. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలు ఏర్పడాలన్న, సరియైన పాలన అందలన్న, నిజాయితీ నిస్వార్థ పాలకులు కావాలన్నా కీలకమైనది ఓటు. ప్రజల చేతిలో శక్తివంతమైన ఆయుధం ఓటు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు సద్వినియోగం చేసుకోవడం తమ ముఖ్యమైన బాధ్యతగా మరియు మన కనీస కర్తవ్యంగా భావించాలి. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైందన్న విషయం ప్రతి ఒక్కరు తెలుసుకొని, ఓటు హక్కును వినియోగించి సమర్థమైన నాయకున్ని ఎన్నుకోవాలి, నిష్పక్షకపాతంగా ప్రజలకు సేవ చేసే నాయకున్ని ఎన్నుకోవాలి అలాంటప్పుడే ప్రజాస్వామ్య రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు పారదర్శకంగా క్షేత్రస్థాయి వరకు అమలు జరిగి అవినీతి అక్రమాలు లేకుండా రాష్ట్ర, దేశ అభివృద్ధి జరుగుతుంది. అభివృద్ధి అనేది పాలకులు ప్రభుత్వాల వల్లనే మాత్రమే కాదు. ప్రజలే భాగస్వాములై ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కు ద్వారా ఎన్నుకునే నాయకుడి వలన విద్య, వైద్యం, ఉపాధి మరియు అన్ని రంగాలలో అభివృద్ధికి దోహదపడడం జరుగుతుంది. ఏ గ్రామానికైనా, ఏ రాష్ట్రనికైనా, ఏ దేశానికైనా మంచి అభివృద్ధి సాధించాలంటే కచ్చితంగా శక్తివంతుడైన నాయకుడు ఎంతో అవసరం మరియు మనం శక్తివంతుడైన నాయకున్ని ఎన్నుకున్నప్పుడే బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయగలము.

### ఓటు చరిత్రక నేపథ్యం:

వలస పాలనలో దాదాపు 15 శాతం మంది భారతీయులు (పరిమిత) ఓటు హక్కును కలిగి ఉన్న పరిస్థితి నుండి ప్రతి వయోజనులకి ఓటు హక్కు కల్పించబడినది అంటే అంబేద్కర్ కృషినే. రెండవ రౌండ్ టేబుల్ సమావేశం ముందు దేశంలో 800 పౌండ్ల ఖర్చు పెట్టే వారికి మాత్రమే ఓటు హక్కు ఉండేది. 1931 సెప్టెంబర్ -7, డిసెంబర్ -31 బ్రిటన్ ప్రధాని రామ్సే మక్డోనాల్డ్ అధ్యక్షతన లండన్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బ్రిటిష్ వాళ్ళ ముందు పెట్టిన ప్రధాన డిమాండ్ ఓటు హక్కు, సమావేశంలో పాల్గొన్న వారు ఓటు పై తమ అభిప్రాయాన్ని తెలుపాలని అడగడంతో జవహర్లాల్ నెహ్రూ రాజ కుటుంబాలకు, 100 ఎకరాల భూస్వాములకు మాత్రమే ఓటు ఇవ్వాలని తెలిపారు. పన్నులు కట్టే వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించాలని మహాత్మా గాంధీ తెలిపారు. డిగ్రీ చదివిన వారికి మాత్రమే ఓటు హక్కు ఇవ్వాలని వల్లభాయ్ పటేల్ తెలిపారు. కానీ అంబేద్కర్ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే మతాల తేడా లేకుండా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి అనే కులాల తేడా లేకుండా, ఆడ మగ తేడా లేకుండా, పేదవాడు ధనవంతుడు, ఉద్యోగి నిరుద్యోగి, నిరక్షరాస్యుడు అక్షరాస్యుడు అనే తేడా లేకుండా భారతదేశంలో జీవిస్తున్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ప్రతిపాదించాడు. దేశంలోని సామాన్య ప్రజలందరికీ ఓటు హక్కును కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల చేతనే ప్రజాప్రతినిధులు ఎన్నుకోవాలని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కృషి వల్లనే దేశ పౌరులకు ఓటు హక్కు కల్పించబడినది.

### ఓటు వేయడం బాధ్యత:

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ ఓటు హక్కు కలదు. ఎలాంటి ప్రలోభాలకు (మద్యానికి, డబ్బుకు, వస్తువులకు) లొంగకుండా, ఎలాంటి తారతమ్యాలకు తావివ్వకుండా, కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటిస్తూ, ప్రభుత్వ అధికార యంత్రంగాలకు సహకరిస్తూ, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి. యువతి యువకులు తమ పరిసర ప్రాంత ప్రజలు అందరికీ ఓటు ఆవశ్యకత తెలియజేస్తూ, అవగాహన కల్పించాలి. ఓటు వేయడం సామాజిక బాధ్యతగా పరిగణిస్తూ ఓటర్లందరూ ఓటు హక్కు లో పాల్గొనాలి. ప్రజల శ్రేయస్సు కోరుతూ, ప్రజల, రాష్ట్ర, దేశ అభివృద్ధి కోసం పని చేసే వారిని ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించి న్యాయబద్ధంగా ఎన్నుకున్నప్పుడే ప్రజాస్వామ్య రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ, గ్రామ, రాష్ట్ర, దేశ అభివృద్ధి మరియు భావితరాల భవిష్యత్తుకు బాటలు వేసిన వాళ్ళము అవుతాము.

### ఓటు విలువను తెలిపే ఉదాహరణలు:

2008 సంవత్సరంలో రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేసులో ఉన్న సిపి జోషి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. ఒక్క ఓటుతో 1999లో వాజ్పేయ్ సర్కార్ కుప్ప కూలింది. 2004లో కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో కృష్ణమూర్తి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. 2018లో మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్ఎల్ పియన్మావాయి మూడు ఓట్ల తేడాతో ఓడిపోయారు. అందుకే ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనదని రాజ్యాంగ నిపుణులు అంటారు. ఒక ఓటు గెలుపు ఓటములను నిర్ణయిస్తుంది. కాబట్టి దేశ భవిష్యత్తు కొరకు సమర్థవంతమైన ప్రభుత్వాలను ఏర్పరుచుకోవాలి అంటే రాష్ట్ర ఎన్నికల సంఘం, కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరు ఓటింగ్ లో పాల్గొనాలి అని శివంపేట మండల సమాచార హక్కు మండల కన్వీనర్ రాజిపేట నాగేష్.(సమాచార హక్కు రక్షణ చట్టం -2005) ఓటు ప్రాముఖ్యత గూర్చి తెలియజేశారు.

# ప్రియమైన ఓటరు మహాశయులకు.. విజ్ఞప్తి

సరైన వ్యక్తిని ఎన్నుకోవాలి!!

ప్రతి ఓటు హక్కు ఉన్న పౌరులు మీ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలి!!!

శ్రీ గురు పీఠం ఫౌండర్ అండ్ చైర్మన్ హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్దగోని జిన్నారం శివకుమార్ గౌడ్



నర్సాపూర్(**గౌతమ్ న్యూస్ ):** ఎవరు మా ఇంటి ముందు కరెంటు స్థంభం పెట్టిస్తాడు, ఎవడు మా ఇంటికి నల్లా పెట్టిస్తాడు అని చూసి ఓటు వేయడానికి ఇప్పుడు జరిగేవి స్థానిక ఎన్నికలు కాదు ఎవడు ప్రభుత్వ ఉచిత పథకాలు ఇస్తాడు ఎవడు లిఉద్యోగుల బదిలీలు చేస్తాడు, ఎవడు ఉచితంగా డబ్బులు పంచి పెడతాడు అని చూసి ఓటు వేయడానికి ఇప్పుడు జరిగేవి అసెంబ్లీ ఎన్నికలు కాదు .. ఇప్పుడు జరిగేవి..దేశంలో దమ్మున్న నాయకుడిని ఎన్నుకునే పార్లమెంట్ ఎన్నికలు.. ఒక్క బాంబు బ్లాస్ట్ జరిగితే పోయేవి వందల మంది దేశ పౌరుల ప్రాణాలు .. అందుకే దేశంలో ఉగ్రవాదులను ఏరి పారేసి..మన ప్రాణాలు రక్షించే వాడిని దేశ నాయకుడిగా ఎన్నుకోవాలి .. వేరే దేశంలో యుద్ధం వస్తే.. అక్కడ మన భారతీయులు ఇరుక్కుపోయినా కూడా.. ఆ దేశాల నాయకులతో మాట్లాడి మన వాళ్ళని వెనక్కి తీసుకొని వచ్చే దమ్మున్న నాయకుడిని ఎన్నుకోవాలి.. అభినందన్ వర్ధమాన్ లాంటి ఒక్క పైలట్..తన విమానం కాలిపోయి పాకిస్తాన్ లో పడిపోయినా కూడా.. పైలట్ కి హాని జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయి అని బెదిరించి.. శత్రు దేశాన్ని భయపెట్టే మొనగాడిని ఎన్నుకోవాలి. ప్రపంచంలో భారతదేశంను అగ్రదేశంగా తీర్చి దిద్దగలిగే దేశభక్తుడిని ఎన్నుకోవాలి.. ఓటు వేసేటప్పుడు గ్యాస్, పెట్రోల్, ఉల్లిగడ్డ, ఆలుగడ్డ లాంటి ధరలు పెరుగుతూ,తగ్గుతూ ఉండే చిన్న విషయాలు ఆలోచించకుండా.. లోకల్ లో నిలబడ్డ అభ్యర్థి యొక్క కులం, పలుకుబడి లాంటి పనికిమాలిన విషయాలు ఆలోచించకుండా.. దేశాన్ని ,దృఢంగా ,అజేయంగా నిలిపి తన దేశ పౌరుల ప్రాణాలు కాపాడే వీరుడిని ఎన్నుకోడానికి..ఓటు వేయండి ..

## సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



చిట్యాల(**గౌతమ్ న్యూస్ ):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా కేక్ కటింగ్ చే సి సీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజ్ హెడ్ నర్సు నీరజ స్టాప్ నర్సులు రాణి స్వప్న అనిత కవిత శ్వేతా సంధ్య సునీత ఏఎన్ఎం మీనాక్షి కోమలాదేవి మరియు హాస్పటల్ సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ నూతి మహేందర్ ఎమ్ ఎన్ ఒచంద్రశేఖర్ హాస్పటల్ సిబ్బంది ఉప్పుల కిరణ్, రాజేందర్ వనిత రాధా భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే గండ్ర



చిట్యాల(**గౌతమ్ న్యూస్ ):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని కాకరపల్లి గ్రామంలో కాంగ్రెస్ ముఖ్య నేత గోండె సురేష్ -వనిత దంపతుల కుమార్తెలు నందిని శ్రీనిధిల నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో వారి ఆహ్వానం మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో కలిసి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు అనంతరం చిన్నారులతో ఎమ్మెల్యే ముచ్చటిస్తూ బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిఎస్ఆర్ వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ మండల యూత్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చేతి గుర్తుకు ఓటేసి సురేష్ షెట్కార్ నీలం మధును గెలిపించండి

**కాంగ్రెస్ నాయకులు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి.**



కొండాపూర్(**గౌతమ్ న్యూస్ ):** నేడు పార్లమెంటు ఎన్నికల ఓటింగ్ సందర్భంగా జహీరాబాద్,మెదక్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్,మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు లను భారీ మెజార్టీతో గెలిపించాలని కొండాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని కావున ప్రజలందరూ ఏకతాటిపై చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించుకున్నట్లయితే కాంగ్రెస్ ప్రభుత్వం మనకు ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలను పక్క అమలు చేస్తుందని ఇవేకాక మరిన్ని సంక్షేమ పథకాలు మనం ఎంపీ అభ్యర్థులను గెలిపించినట్లయితే కేంద్రం నుంచి తీసుకొస్తారని అన్నారు. కావున ప్రతి ఒక్క ఓటర్ మహాశయులు కాంగ్రెస్ అభ్యర్థులను దీవించాలని కోరారు.


## వరంగల్లో.. గెలుపెవరిదో..!




హన్మకొండ (**గౌతమ్ న్యూస్ ):** వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముఖ్య పార్టీల ఎంపీ అభ్యర్థులతో పాటు ఆ పార్టీ నేతలు జోరుగా ప్రచారం నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి బిఆర్ఎస్- సుధీర్ కుమార్, కాంగ్రెస్- కడియం కావ్య, బిజెపి ఆరూరి రమేష్, స్వతంత్ర అభ్యర్థులు సైతం బరిలో ఉండగా ప్రజలు తీర్పే కీలకంగా మారింది

# తరలివచ్చిన ఎన్నికల మద్యం


## రహస్య ప్రదేశాల్లో మద్యం కాటన్ లు



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్ ):** రేపటి పార్లమెంటు ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓట్ల కోసం ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి లక్షలాది రూపాయల ఖర్చుపెట్టి ప్రతి గ్రామంలో మద్యమం కాటన్ డబ్బాలు విచ్చలవిడిగా రాజకీయ పార్టీల నాయకుల ఇండ్లలో వ్యవసాయ పొలాలు మామిడి తోటలలో బంధువుల ఇండ్లలో నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ వర్గాల



ద్వారా తెలిసింది, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో అక్రమ మద్యమం అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులై వ్యవసాయ పొలాలలో మామిడి తోటలలో నిల్వ ఉంచినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు, పెట్ట కొత్తపల్లి మండలం కల్వకోల్, చిన్నపరావుపల్లి, సాతాపూర్, కోడేరు మండలంలోని ఎత్తం, కొండ్రావుపల్లి తదితర గ్రామాలలో మామిడి తోటల్లో మద్యమం కాటన్ల కొద్ది నిలువ ఉంచినట్లు తెలుస్తుంది, పై గ్రామాలతో పాటు అసెంబ్లీ నియోజకవర్గంలోని పానగల్ ,వీపనగండ్ల, కొల్లాపూర్, తదితర మండలాల్లోని వివిధ గ్రామాలలో కూడా ఓటర్లను గాలం వెయ్యడానికి గత పది రోజుల క్రితమే వైన్ షాపుల నుంచి మద్యమాన్ని కొనుగోలు చేసినట్టు ఆయా గ్రామ ప్రజల ద్వారా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది, అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీ టిఆర్ఎస్ పార్టీ నాయకులతోపాటు భారతీయ జనతా పార్టీ నాయకులు కూడా ఎంపీ స్థానంలో గెలుపొందడానికి మద్యమాని డబ్బును ఎరచూపి ప్రజలను నట్టేట ముంచుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, కేంద్రంలో అధికారం కోసం ఒకపక్క కాంగ్రెస్ మరో పక్క బీజేపీ పోటాపోటీగా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దొరినవ్ అని చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి, రేపు ఉదయం ప్రారంభం కానున్న పార్లమెంటు ఎన్నికల కోసం ఈరోజు రాత్రి మందు డబ్బులు పంపిణీ ముంబారంగా చేపట్టడానికి ఆయా గ్రామ రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటికే పకడ్బందీ ప్రణాళికను రూపొందించుకున్నట్లు తెలిసింది, ఇంతతంగం జరుగుతున్న స్థానిక ఎక్సైజ్ అధికారులు పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మామూళ్ల మత్తులో అధికారులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రలోభాలకు గురి చేయకుండా అరికట్టవలసిన అధికారులే కొమ్ము కాస్తున్నారని విమర్శలు వస్తున్నాయి, ఇప్పటికైనా రాత్రి వరకు గ్రామాలలో పోలీసులు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రతి గ్రామంలో మందు డబ్బు ప్రవాహాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు,



# బయ్యారం మండలంలో పోలింగ్ కు సర్వం సిద్ధం

## ఏజెన్సీ ప్రాంతంలో పోలీసు నిఘా.

బయ్యారం(**గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో ఎనిమిది సెక్టార్లో, 44 పోలింగ్ కేంద్రాలు. పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగం, కొరకు ఏర్పాట్లు పూర్తి.మండలమంతా 144 సెక్షన్, ఉదయం 7 నుండి 4 పోలింగ్.మండలంలో 40వేల, ఓటర్లు, తమ ఓటు హక్కు




వినియోగించుకునే అవకాశం. పార్లమెంట్ ఎన్నికలకు నేడు జరగబోయే ఓటింగ్ కొరకు ఓటర్లకు ఓటు హక్కును వినియోగించుకునే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను ఏర్పాటు చేయడం జరిగింది. బయ్యారం మండలంలో 8 సెక్టార్లుగా విభజించి 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. మండలానికి సంబంధించిన సుమారుగా 40,7550 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కొనుటకు అధికారులు ఆదివారం ఎన్నికల ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు 44 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు, బయ్యారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో , గ్రామపంచాయతీ



కార్యాలయం 7 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది, ఒక్కొక్క పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా, కొత్తపేట లో 8 , జగ్గుతండా జిపి ప్రభుత్వ పాఠశాలలో 4 పోలింగ్ బూతులు చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు, మిగతా 26 జీపిలో ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు, మండలంలో ఓటర్లు తమ ఓటు హక్కును ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకూ వినియోగించుకొ నున్నారు.. మండలంలో ఓటు హక్కును వినియోగించు కొనుటకు వచ్చే ఓటర్ల కొరకు, ప్రత్యేక ఏర్పాట్లను అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల అధికారులు ఏర్పాటు చేయడం జరిగింది, ఓటర్ల కొరకు మంచినీరు, వృద్ధుల కొరకు ప్రత్యేకంగా 'వీల్ చేర్' సదుపాయం, తో పాటు ఎండ ప్రభావానికి గురికాకుండా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ 'టెంట్' లను మంచి నీరు సౌకర్యం ఇతర మౌళిక వసతులు ఏర్పాటు చేయడం జరిగింది.బయ్యారం మండలం మారుమూల అటవీ ప్రాంతం కావడంతో ఎన్నికలు ప్రశాంతంగా ట్రైనీ ఎస్పీ పండరీచేతన్,సిఐ రవికుమార్ ప్రత్యేక బలగాలను రప్పించడం జరిగింది. ఏజెన్సీ గ్రామాలలో పోలింగ్ ప్రశాంతనంగా జరిగేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



హన్మకొండ(**గౌతమ్ న్యూస్ ):** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం సాయంత్రం పరిశీలించారు. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించారు.

## భవన నిర్మాణ రంగంలో ఉపాధి..!



**హన్మకొండ(గౌతమ్ న్యూస్ ): భవన నిర్మాణ రంగం పై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలలోని నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ కల్పిస్తున్నట్లు హనుమకొండ జిల్లా న్యాయ అధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉన్నవారు ఇందుకు అర్హులు అన్నారు. అర్హులైన వారు పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.**

## ఓటు హక్కు భారం కాదు.. బాధ్యత

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల.**




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ ):** జిల్లాలో జరుగు పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు బాధ్యతగా వినియోగించుకోవాలని, ఓటు హక్కు భారం కాదు, బాధ్యత అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.భారత రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధమని చెప్పారు. సమర్ధవంతమైన నాయకుడిని ఎన్నుకునే అకాశం ఓటు హక్కు ద్వారా మాత్రమే ఉంటుందని తెలిపారు. జిల్లాలో 100% ఓటింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు అన్ని కల్పించామని తెలిపారు. జిల్లాలో రేపు ఉదయం 7 గంటల నుంచి 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఒక ప్రకటనలో తెలిపారు.

## ఈ సారి కాంగ్రెస్ పార్టీకి యువరాజు వయసు కన్నా తక్కువ సీట్లే

పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొ న్న ప్రధాని నరేంద్ర మోడీ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.సందేశ్‌ఖాలీలో టీఎంసీ నాయకులు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఇప్పుడు ఆ పార్టీ గుండాలు వారిని బెదిరిస్తున్నారని మోడీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ 53 ఏళ్ల వయసును ప్రస్తావిస్తూ.. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి యువరాజు వయసు కన్నా తక్కువ సీట్లే వస్తాయని ఎద్దేవ చేశారు. వెస్ట్ బెంగాల్ లోని బరాక్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ.. టీఎంసీ పాలనలో రాష్ట్రంలోని హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులుగా మారారని మండిపడ్డారు.మోడీ ఉన్నంత వరకు సీఏఏ చట్టాన్ని రద్దు చేయలేరని స్పష్టం చేశారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై టీఎంసీ ఏం చేసిందో మనమందరం చూశాం, ప్రధాన నిందితుడు షేక్ షాజహాన్ పేరు చెప్పి టీఎంసీ గుండాలు ఇప్పుడు మహిళల్ని బెదిరిస్తున్నారని ఆరోపించారు . టీఎంసీ పాలనలో బెంగాల్ అవినీతికి కేంద్రంగా మారిందని, బాంబుల తయారీ కుటీర పరిశ్రమగా మారిందని , ఓటు బ్యాంకు రాజకీయాల ముందు రాష్ట్ర పాలన యంత్రాంగం లొంగిపోయిందని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు.

## పోల్ వయొలెన్స్ జరగకూడదని జిల్లా ఎస్పీలకు ఈసీ వార్నింగ్..



ఏపీలో సోమవారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగబోతుంది. రాష్ట్రంలోని 25 లోక్?సభ స్థానాలతో పాటు.. 175 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో.. ఈసీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఏపీ సీఈఓ ఎంకే మీనా మాట్లాడుతూ.. పోల్ వయొలెన్స్ జరగకూడదని జిల్లా ఎస్పీలకు ఈసీ వార్నింగ్ ఇచ్చిందన్నారు. జీరో వయొలెన్స్, జీరో రీ-పోలింగ్ లక్ష్యంగా ఎన్నికల నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. 64 శాతం మేర పోలింగ్ స్టేషన్లలో వెబ్ కామ్ పెట్టామని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ల లోపల.. బయట వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశామని ఏపీ సీఈఓ చెప్పారు. మరోవైపు.. పోల్ డేటా మానిటరింగ్ సిస్టం--PDMS యాప్ ద్వారా పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తామని ఎంకే మీనా పేర్కొన్నారు. కొన్ని చోట్ల కొందరు ప్రలోభాలకు గురి చేస్తున్నారనే సమాచారం వస్తోందని.. గతంలో ఎన్నడూ లేనంతగా పోలీస్ అబ్జర్వర్లు, జనరల్ అబ్జర్వర్లను ఈసీ నియమించిందని అన్నారు. ఓటర్లను ఎన్నికలకు రాకుండా చేసేలా ఎవరైనా వేళ్లపై ఇంకు గుర్తు వేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 20 శాతం మేర ఈవీఎంల బఫర్ స్టాక్ వచ్చిందని.. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పరిష్కరించే మెకానిజం ఏర్పాటు చేసుకున్నామని ఏపీ సీఈఓ తెలిపారు. గతం కంటే ఎక్కువగా పోస్టల్ బ్యాలెట్ వినియోగం జరిగిందని ఎంకే మీనా చెప్పారు. ఈసారి 90 శాతం మేర పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగిందని.. దూర ప్రాంతాల నుంచి ఓటేసేందుకు వచ్చే వారికి ఇబ్బందులు రాకుండా చూస్తామని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా ఉండేలా చూడాలని ఆర్టీసీ ఎండీతో మాట్లాడామని.. ఎన్నికల సిబ్బంది నిమిత్తం కొన్ని ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటున్నామని తెలిపారు. మరోవైపు.. వృద్ధులకు, దివ్యాంగులకు పోలింగ్ స్టేషన్లల్లో ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని ఏపీ సీఈఓ ఎంకే మీనా పేర్కొన్నారు.

## "యువరాజు వయసు కన్నా తక్కువ సీట్లే వస్తాయి".. కాంగ్రెస్‌పై పీఎం సెటైర్లు..



పశ్చిమ బెంగాల్‌లో ఈ రోజు ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీలపై విరుచుకుపడ్డారు. సందేశ్‌ఖాలీలో టీఎంసీ నాయకులు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఇప్పుడు ఆ పార్టీ గుండాలు వారిని బెదిరిస్తున్నారని మోడీ ఆరోపించారు. రాహుల్ గాంధీ 53 ఏళ్ల వయసును ప్రస్తావిస్తూ.. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి యువరాజు వయసు కన్నా తక్కువ సీట్లే వస్తాయని అన్నారు. నార్ 24 పరగణాస్ జిల్లాలోని బరాక్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ.. టీఎంసీ పాలనలో రాష్ట్రంలోని హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులుగా మారారని ప్రధాని మోడీ ఆరోపించారు. మోడీ ఉన్నంత వరకు సీఏఏ చట్టాన్ని రద్దు చేయలేరని అన్నారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై టీఎంసీ ఏం చేసిందో మనమందరం చూశాం, ప్రధాన నిందితుడు షేక్ షాజహాన్ పేరు చెప్పి టీఎంసీ గుండాలు ఇప్పుడు మహిళల్ని బెదిరిస్తున్నారని ప్రధాని ఆరోపించారు. టీఎంసీ పాలనలో బెంగాల్ అవినీతికి కేంద్రంగా మారిందని, బాంబుల తయారీ కుటీర పరిశ్రమగా మారిందని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల ముందు రాష్ట్ర పాలన యంత్రాంగం లొంగిపోయిందని అన్నారు. బెంగాల్‌లో ఓటు బ్యాంకు రాజకీయాల ముందు శ్రీరాముడి పేరు చెప్పకోలేమని, రామ నవమి జరుపులోనమని అన్నారు. టీఎంసీ పాలనలో బెంగాల్ హిందువుల పరిస్థితి ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చబడ్డారని ఆయన అన్నారు. హుగ్లీలో జరిగి మరో ర్యాలీలో ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యం ఆల్ టైం కనిష్ట స్థాయికి చేరుతుందని ప్రధాని అన్నారు. రామ మందిర నిర్మాణం తర్వాత ఆ పార్టీకి నిద్ర కరువైందని, రామ మందిరాన్ని కూడా బహిష్కరించారని, రామ మందిరం కోసం 500 ఏళ్ల పోరాటం చేసిన మన పూర్వీకుల ఆత్మలు ఈ కాంగ్రెస్, టీఎంసీల చేష్టల్ని చూస్తున్నారని, మీ పూర్వీకులు త్యాగాన్ని అవమానించొద్దని ప్రధాని మోడీ అన్నారు. రాముడిని బహిష్కరించడం బెంగాల్ సంస్కృతి కాదని చెప్పారు.

## పాక్ వద్ద అణుబాంబులు ఉంటే పీఓకేని వదిలేయాలా.. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై అమిత్ షా ఫైర్..



కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్ అవుతోంది. ఇటీవల ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయి, వారితో సఖ్యతగా వ్యవహరించాలి, పీఓకేని అడగొద్దని వ్యాఖ్యానించారు. దీనిపై ప్రధాని నరేంద్రమోడీతో పాటు మిగతా బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కేంద్ర హోం మంత్రి అయ్యర్ వ్యాఖ్యలపై ఫైర్ అవుతున్నారు. కౌశాంబి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఆయన మాట్లాడుతూ.. "మణిశంకర్ అయ్యార్, ఫరూఖ్ అబ్దులు అణుబాంబు ఉన్నందున పాకిస్తాన్‌ని గౌరవించాలని, పాక్ ఆక్రమిక కాశ్మీర్ అడగొద్దని చెప్పారు. రాహుల్ బాబా మీరు అణుబాంబుకు భయపడుతున్నారు, మేం భయపడటం లేదు, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ భారత్‌కి చెందినది, దాన్ని మేం తిరిగి పొందుతాం" అన్నారు. మణిశంకర్ అయ్యర్ వైరల్ వీడియోలో మాట్లాడుతూ..పాకిస్తాన్ సార్వభౌమాధికార దేశం, భారత్ దానికి గౌరవం ఇవ్వాలి, వారి వద్ద అణు బాంబులు ఉన్నాయని చెప్పారు. ఎవరైనా పిచ్చివాడు లాహోర్‌పై బాంబు వేస్తే దాని ప్రభావం అమృత్ సర్‌పై ఉంటుందని ఆయన అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యలకు కాంగ్రెస్ దూరంగా ఉంది, తమకు అయ్యర్ తో సంబంధం లేదని చెప్పింది. అంతకుముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, పీఓకేని భారత్ స్వాధీనం చేసుకుంటుందని అన్నారు. ఆయన వ్యాఖ్యలకు కాశ్మీరీ నేత ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడుతూ.. పాకిస్తాన్ గాజులు తొడుక్కోని లేదని, వారి వద్ద అణుబాంబులు ఉన్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కూడా దుమారం రేగింది.

## ఎన్నికల పర్యవేక్షణ కోసం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు..



ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం రోజు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగబోతోంది.. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలతో పాటు.. 175 అసెంబ్లీ స్థానాలకు కూడా పోలింగ్ జరగనుంది.. అయితే, పోలింగ్ సరలిని ఎప్పటికప్పుడు మానీటరింగ్ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది.. ఎన్నికల పర్యవేక్షణ నిమిత్తం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది ఏపీ సీఈవో.. మొత్తం 36 వేలకు పైగా పోలింగ్ స్టేషన్లల్లో ఎన్నికలను మానిటర్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ స్టేషన్ల లోపల.. వెలుపలా వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా వెబ్ కెమెరాల పర్యవేక్షణకు ఏర్పాట్లు చేసింది ఎన్నికల కమిషన్.. జీరో వయొలెన్స్ పోలింగ్ లక్ష్యంగా పనిచేయాలన్న ఉద్దేశంతో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటుకు పూనుకన్నారు. ఇక, ఈ కమాండ్ కంట్రోల్ రూంలో 200 మంది సిబ్బందిని పెట్టింది.. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ సరళి పర్యవేక్షిస్తూ.. ఏదైనా సమస్యలు వస్తే.. వెంటనే ఉన్నతాధికారులకు చేరవేసేలా ఏర్పాట్లు చేశారు.

# ఎన్డీఏతో హోరాహోరీ పోరు.. వైసీపీ ట్రెండ్ సెట్ చేసేనా





మే 13న జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల కోసం ఆంధ్రప్రదేశ్ అధికార పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్, నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్డీఏ) మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్‌సిపి) 175 అసెంబ్లీ సెగ్మెంట్లు, 25 లోక్‌సభ నియోజకవర్గాలలో టిడిపి-జెఎస్‌పి-బిజెపి కూటమి నుండి అధికార వ్యతిరేకతను, గట్టి సవాలును ఎదుర్కొంటోంది. 2019లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి అఖండ మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకున్న జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టగా, టీడీపీ నేతృత్వంలోని కూటమి ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ 'విధ్వంసకరం' పాలన నుంచి కాపాడాలనే నినాదంతో ప్రచారం సాగించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఇది మూడో ఎన్నికలు కావడం వల్ల అధికారపక్షానికి ఓటు వేసే ట్రెండ్ సెట్ అవుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. త్రైపాక్షిక కూటమి ప్రతిపక్షాల అవకాశాలకు బలం చేకూర్చినట్లయింది. గత ఎన్నికల్లో దుమ్మురేపిన ఓటమి తర్వాత, నటుడు-రాజకీయ నాయకుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని టీడీపీ, జనసేన పార్టీ (జెఎస్‌పి), భారతీయ జనతా పార్టీ (బిజెపి) వైఎస్ఆర్‌సిపిని ఎదుర్కోవడానికి మళ్లీ ఒక్కటయ్యాయి. గత నెలలో 74 ఏళ్లు పూర్తి చేసుకున్న టీడీపీ అధినేత ఎన్.చంద్రబాబు నాయుడుకు ఈ ఎన్నికల పోరు ఆయన పార్టీ భవిష్యత్తుకు కీలకం. మరో పర్యాయం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడానికి సీనియర్ రాజకీయ నాయకుడు బీజేపీతో చేతులు కలపడానికి వెనుకాడలేదు. గత ఏడాది చివర్లో చంద్రబాబు అవినీతి కేసులో అరెస్టయి జైలుకెళ్లినప్పుడు టీడీపీతో పొత్తు పెట్టుకునేందుకు శ్రీకారం చుట్టింది పవన్ కళ్యాణ్. అధికార వ్యతిరేక ఓట్ల చీలికను నివారించడానికి వారితో చేతులు కలపాలని నటుడు తరువాత బిజెపిని ఒప్పించాడు. చంద్రబాబును మరోసారి నమ్మేందుకు సంకోచించిన బీజేపీ చివరి నిమిషంలో కూటమిలో చేరింది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో టీడీపీ మెజారిటీ అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తోంది. మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో జనసేనకు 21, బీజేపీకి 10 సీట్లు ఇచ్చారు. చంద్రబాబు నాయుడు.. జనసేనకు రెండు లోక్‌సభ స్థానాలు, బీజేపీకి ఆరు స్థానాలు కేటాయించారు. 2014, 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పార్టీ అధినేత వైఎస్ షర్మిల పేరును ప్రస్తావిస్తూ మళ్లీ పుంజుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆ పార్టీకి పెద్దగా లాభం చేకూరే అవకాశం లేదు. రాజకీయ విశ్లేషకులు ఆ పార్టీ తన ఓట్ల శాతాన్ని స్వల్పంగా మెరుగుపరుచుకోవచ్చని, కొన్ని నియోజకవర్గాల్లో వైఎస్ఆర్‌సిపి ఓట్లను తగ్గించవచ్చని అంటున్నారు. కాంగ్రెస్ కూడా 16 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలను మిత్రపక్షాలైన సీపీఐ, సీపీఎంలకు వదిలిపెట్టింది. 2019లో ముఖ్యమంత్రి అయిన తర్వాత తన సోదరుడు తనను పట్టించుకోకపోవడంతో ఆయనతో విభేదించిన షర్మిల.. కాంగ్రెస్‌లో చేరి ఆయనకు ఇబ్బంది కలిగించారు. వైఎస్ఆర్ కుటుంబం తన కంచుకోట అయిన కడప జిల్లాలో తన బంధువు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డికి వ్యతిరేకంగా కడప లోక్‌సభ స్థానం నుంచి షర్మిల బరిలోకి దిగడంతో వరుసగా మూడోసారి మళ్లీ ఎన్నికవ్వాలని కోరుతున్న వైఎస్ఆర్ కుటుంబం నిలువునా చీలిపోయింది. తమ బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో అవినాష్‌రెడ్డి నిందితుడని సీబీఐ పేర్కొన్నప్పటికీ.. అవినాష్‌రెడ్డిని మరోసారి రంగంలోకి దింపేందుకు జగన్ ఎత్తుగడ వేయడాన్ని షర్మిల ప్రశ్నించారు. 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కడప జిల్లా పులివెందులలోని తన ఇంట్లో మాజీ మంత్రి హత్యకు గురయ్యారు. గత ఐదేళ్లలో సంచలనం సృష్టించిన ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. ఈ కేసులో న్యాయం కోసం పోరాడుతున్న వివేకానందరెడ్డి కుమార్తె సునీతారెడ్డి షర్మిలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. హత్యా నిందితులకు రక్షణగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని, ఆయన పార్టీని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తనపై కుట్రకు తన సోదరీమణులను ఉపయోగించుకున్నందుకు జగన్ చంద్రబాబు నాయుడును తప్పుపట్టారు. అయితే ఇద్దరు మహిళలు ఆ ఆరోపణలను కొట్టిపారేశారు. జగన్.. తనను ఒంటరిగా ఎదుర్కోలేక ప్రతిపక్ష పార్టీలు గుంభనంగా తయారయ్యాయని ఆరోపించారు. జగన్ అన్న సింహం లాంటి వాడు, ఒక్కడే వస్తాడు, గర్జిస్తూ వస్తాడని ఎన్నికల ర్యాలీలో ప్రకటించారు. నాయుడు తిరిగి వస్తే గత ఐదేళ్లలో వైఎస్ఆర్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ ఆపేస్తానని ప్రజలను హెచ్చరించారు. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు లేదా ఎంపీలను ఎన్నుకోవడం మాత్రమే కాదని, ఇది రాష్ట్ర భవిష్యత్తును రూపొందించడమేనని వైఎస్ఆర్‌సిపి చీఫ్ అన్నారు. గడిచిన 59 నెలల కాలంలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో అపూర్వమైన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. 'ఒక బటన్ నొక్కడంతో, అవినీతి లేదా వివక్షకు తావు లేకుండా రూ. 2.70 లక్షల కోట్లు కేటాయించాం, రాష్ట్ర ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చాం' అని ఆయన అన్నారు. వైఎస్సార్‌సీపీ 2019 మేనిఫెస్టోలో 99 శాతం హామీలను నెరవేర్చిందని, ప్రభుత్వం 2.31 లక్షల ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. విప్లవాత్మక కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూనే అనేక పథకాలు ప్రవేశపెట్టి, మార్పులను అమలు చేసి, సంస్కరణలు తీసుకొచ్చానని, రాబోయే 15 ఏళ్లలో తాను నాటిన విత్తనాలు బలమైన వృక్షాలుగా మారుతాయని ప్రజలకు చెప్పారు. అయితే సీఎం జగన్ తన విధానాలతో రాష్ట్రాన్ని 'నాశనం' చేశారని ప్రతిపక్షం ఆరోపించింది. కేవలం రాజకీయ కక్షతో ఆయన వ్యవహరిస్తున్నారని, అమరావతిని రాష్ట్ర రాజధానిగా అభివృద్ధి చేయకుండా రాష్ట్రాభివృద్ధిని నిర్వీర్యం చేశారని, మద్యం, భూ, ఇసుక, గనుల మాఫియాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. 2019లో 175 స్థానాలున్న అసెంబ్లీలో 151 స్థానాలను కైవసం చేసుకుని భారీ మెజారిటీతో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇందులో 49.95 శాతం ఓట్లు పోలయ్యాయి. టీడీపీ 23 సీట్లతో 39.17 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. 25 లోక్‌సభ స్థానాలకు గాను జగన్ పార్టీ 22 స్థానాలను కైవసం చేసుకోగా, మిగిలిన మూడు స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), వామపక్ష పార్టీలతో పొత్తు పెట్టుకున్న జనసేన కేవలం ఒక్క అసెంబ్లీ సీటు మాత్రమే గెలుచుకోగలిగింది. పవన్ కళ్యాణ్ పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఓటమి చవిచూశారు. ఆ పార్టీకి 5.53 శాతం ఓట్లు పోలయ్యాయి. 2019లో బీజేపీ కూడా ఒంటరిగా వెళ్లి ఓడిపోయింది. కేవలం 0.84 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. రాష్ట్ర రాజకీయాల్లో ఇద్దరు కీలకమైన ప్రాంతీయ ఆటగాళ్లు ఆధిపత్యం చెలాయిస్తున్నందున, బిజెపి మరియు కాంగ్రెస్ రెండింటికీ చెప్పుకోదగ్గ ఉనికి లేదు. 2014 ఎన్నికలలో, కాంగ్రెస్ కేవలం 2. 77 శాతం ఓట్లను మాత్రమే సాధించింది మరియు ఆంధ్రప్రదేశ్ విభజనపై ప్రజల ఆగ్రహం కారణంగా ఖాళీ అయింది. అప్పటి నుంచి ఆ పార్టీ చాలా మంది అగ్రనేతలను వైఎస్సార్‌సీపీ లేదా టీడీపీలో కోల్పోయింది. 2019లో వరుసగా రెండో ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క లోక్‌సభ లేదా అసెంబ్లీ సీటును కూడా గెలవలేదు, అయితే దాని ఓట్ల శాతం 1.23 శాతానికి పడిపోయింది. 2014లో టీడీపీతో పొత్తు పెట్టుకున్నప్పుడు బీజేపీ నాలుగు అసెంబ్లీ సీట్లు, రెండు లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంది. జనసేన ఎన్నికల్లో పోటీ చేయకపోయినా టీడీపీ-బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కులం కీలక పాత్ర పోషిస్తుంది. కమ్మలు టీడీపీకి మద్దతుదారులుగా కనిపిస్తుండగా, ఇతర శక్తివంతమైన రెడ్డి వర్గీయులు వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నారని భావిస్తున్నారు. ప్రధానంగా రెడ్డిలు, కాపులు, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు, మైనారిటీల మద్దతు కారణంగా 2019 లో వైసీపీ భారీ ఆధిక్యాన్ని పొందింది. అయితే ఈ వర్గాల ఆదరణతో మళ్లీ తాము గెలుస్తామని టీడీపీ చెబుతోంది. పవన్ కళ్యాణ్ నుంచి వచ్చిన కాపుల మద్దతు లభిస్తుందని జనసేన భావిస్తోంది. రాష్ట్ర జనాభాలో 139 ఉపకులాలతో బీసీలు దాదాపు 50 శాతం ఉన్నారు. ఎస్సీలు 19 శాతం ఉండగా, ఎస్టీలు 5.6 శాతం ఉన్నారు. మైనార్టీలు దాదాపు ఏడు శాతం. ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ, ప్రస్తుతం ఉద్యోగాలు, విద్యలో ఆ సామాజికవర్గం అనుభవిస్తున్న నాలుగు శాతం కోటాను కాపాడుతామని టీడీపీ హామీ ఇచ్చింది.

# ఓటే..నీ ఆయుధం!




'జాగ్రత్త ప్రతి ఓటూ, ఒక.. నీ పచ్చి నెత్తురు మాంసం ముద్దచూస్తూ చూస్తూ వేయకు ఏదో ఓ గద్దకి. అది కేవలం కాగితం మీద గుర్తు కాదు, జీవితం కింద ఎర్తు' అంటాడు అలిశెట్టి ప్రభాకర్. దేశ భవిత, మరో ఐదేండ్లు తీర్చిదిద్దుకోవటానికి జరుగుతున్న ఎన్నికలివి. ఇప్పటికి గత పదేండ్లుగా బీజేపీ నాయకత్వాన ఉన్న ఎన్డీయే పరిపాలన మనకు చాలా స్పష్టంగానే అనుభవంలోకి వచ్చింది. మనం ఓటు వేసే ముందు తప్పకుండా ఈ పదేండ్లనూ ఒకసారి మననం చేసుకోవాలి. భవిష్యత్తు ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలి. చాలామంది ప్రజలు జరిగిపోయిన సంఘటనలను, ఇబ్బందులను, ప్రభుత్వం పెట్టిన బాధలను, పెంచిన ధరలను, విధ్వంసాలను, అమానవీయతలను మరచిపోతుంటారు. ఇక్కడే జాగ్రత్త వహించాలి. ఎన్నికల వేల మాటలకు తేనెపూస్తారు. అమాయకంగా లెక్కలేనన్ని వాగ్దానాల్నీ వెద జల్లుతారు. మేమలా అనలేదనీ, మమ్మల్ని నమ్మండనీ వేడుకుంటారు. ఘనమైన ప్రచార ఆర్భాటాలకూ పూనుకుంటారు. ఛానెళ్లు, మీడియా, పత్రికలు అన్నీ వాళ్లవైపే ఊదరకొడుతుంటాయి. అందుకనే, వాళ్ల మాటలు పక్కనపెట్టి గతంలో వాళ్లేమి చెప్పి వచ్చారో, ఏం చేశారో బేరీజు వేసుకోవాలి. 'ఒక్కరోజు భాగోతానికి మూతి మీసాలు కొరుక్కున్నట్టు' అని ఒక సామెత ఉంది. ఒక్కరోజు కోసం డబ్బులు పంచుతారు, మందుపోస్తారు, మాంసం తినిపిస్తారు. కానీ ఐదేండ్లు కాల్చుకు తింటారు. చేపకు ఎరవేసిన తీరే ఇది కూడా. అందుకే ఆలోచించి ఓటు వేయాలి. 'మట్టి బానలు కొనిన కొట్టి చూచెదము/ సరుకు కొన వీధెల్ల తిరిగి చూచెదము, పండు పండేనో లేదో పట్టి చూచెదము, ఓటిచ్చునప్పుడే ఉండాల బుద్ధి, ఎన్నుకొని తలబాదుకొని యేమి ఫలము' అని కాళోజీ హెచ్చరించాడు. ఎందుకంటే, మన రాజ్యాంగము, దాని విలువలయిన ప్రజాస్వామ్యము, సామ్యవాదము, లౌకిక, సమాఖ్య విధానాలకు, సౌభ్రాతృత్వానికి ప్రమాదం ఏర్పడి, హక్కులు, స్వేచ్ఛ, అడుగంటిపోయిన సందర్భంలో, ఇక్కడ తరాలుగా జీవిస్తున్న వారి పౌరసత్వమే ప్రశ్నార్థకంగా మారిన సందర్భంలో ఈ ఎన్నికలు మన ముందుకొచ్చాయి. ఎప్పుడూ లేని విధంగా మతపరమైన విభజన పెరిగింది. నేటి కేంద్ర పాలకుల ఆలోచనలకు ఆధ్యుడు, సిద్ధాంతకర్త అయిన గోల్వాల్కర్, సావర్కర్లు, మన జాతీయ జెండాను ఎగుర వేయటాన్ని అంగీకరించలేదు. అంబేద్కర్ రాజ్యాంగాన్నీ ఒప్పుకోలేదు. మనుస్మృతి మా ఆచరణని బహి రంగంగానే చెప్పారు. ఇప్పుడు సనాతన ధర్మమైన కులవ్యవస్థనూ సమర్థిస్తున్నారు. దేశ ప్రజలందరూ సమానమన్న రాజ్యాంగ విలువను వీరు అంగీకరించరు. హిట్లరు మా ఆదర్శమంటారు. గాంధీని చంపటం న్యాయమంటారు. ముస్లింలు, క్రిస్టియన్లు చొరబాటుదారులని పేర్కొంటారు. బీఫ్ తింటే చంపు తారు. ఆడవాళ్లు మగవారు చెప్పినట్టు వినాలంటారు. పైకి ఒకటి చెబుతారు, లోన ఒకటి చేస్తారు. రామరాజ్యమని పైకి చెప్పి, మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన వాడి కొడుక్కి సీటిచ్చి గెలిపించమంటారు. ఇదెక్కడి నీతి, రీతి! ఈ పదేండ్ల ప్రభుత్వం ప్రజలను ఎన్ని ఇక్కట్లుకు గురిచేసిందో, ఏయే ఘనకార్యాలు చేసిందో, చూడాలి! మునుపెన్నడూ లేనంత పెట్రోలు ధర పెంచింది. గ్యాసు ధరపై ధర్నాలు చేసిన వీళ్లే విపరీతంగా పెంచారు. ప్రపంచ ఆకలిసూచీలో మన దేశం దిగజారి పోయింది. పేదరికమూ పెరిగింది. నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. లాక్డౌన్ తర్వాత అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయారు. లాక్డౌన్లో కార్మికులు నడుచుకుంటూ వాళ్ల ఊర్లకు పోతుంటే నిర్బంధించారు. వారి నుంచి చార్జీలు వసూలు చేశారు. రాజధానిలో రైతులు మద్దతు ధర ఇవ్వాలని ఏడాది పాటు నిరసన తెలిపితే దేశ ద్రోహులని కాల్పులు జరిపారు. కానీ ఆదానీ, అంబానీలకు రూ.లక్షలకోట్లు మాఫీ చేశారు. ప్రభుత్వ సంస్థల్ని కార్పోరేట్లకు అప్పనంగా అమ్మేసారు. కనీసం కరోనా వాక్సిన్ ఉచితంగా ఇస్తామనలేదు. పెద్దనోట్ల రద్దుతో జనాన్ని చంపారు. మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. రక్షణ కరువైంది. మణిపూర్లో మత విద్వేషాల్ని తెగల తగువును రెచ్చగొట్టారు. మహిళల్ని నగంగా ఊరేగిస్తే, హత్యలు జరుగుతోంటే, కనీసం సందర్శించ తీరుబడి ప్రధానికి లేకపోయింది. వీటన్నింటినీ ప్రశ్నించిన ఉద్యమకారుల్ని, జర్నలిస్టుల్ని అక్రమ కేసులు పెట్టి నిర్బంధించారు. ప్రజా స్వామ్యం నుండి నిరంకుశత్వంలోకి దేశాన్ని తీసుకుపోతున్నారు. మీడియాను కొనేసారు, ఎంపీలను, ఎమ్మెల్యేలనూ కొని ప్రభుత్వాలను కూల్చారు. తమకు వంతపాడని వారిపైకి ఈడి, సిబిఐ, ఐటి దాడులు చేయించి జైల్లో వేయిస్తున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులనూ నిర్బంధించారు. ఎన్నికల బాండ్ల పేరిట వేల కోట్ల రూపా యలను చందాలుగా తీసుకుని అవినీతికి పాల్పడ్డారు. కోర్టు రద్దు చేసినా, మళ్లీ తెస్తామని చెబుతు న్నారు. విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. హిందువుల సంపదను ముస్లింలకు దోచిపెడతారని మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ అబద్ధాలు ప్రచారం చేసినా ఎలక్షన్ కమీషన్ కలగజేసుకోలేక పోయింది. ముఖ్యంగా యువత ఎదురు చూస్తున్న ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసారు కదా! వీటిగురించి ఒక్కమాటా చెప్పరు. ఇలా ఎన్నో వైఫల్యాలు మన కండ్లెదుటే కనపడుతున్నాయి. దేశ భవిష్యత్తు యువత చదివే విద్యనూ మతం ఆధారంగా మార్చేసారు. బాబాలకు, యోగులకు నీతి బాహ్యమైన వ్యాపారాలకు అను మతి ఇస్తున్నారు. గెలిస్తే రాజ్యాంగాన్నే మారుస్తామని ప్రకటించే వీరిపట్ల జాగ్రత్త వహించకపోతే నియంతృత్వ కత్తిని మనపై దింపుతారు. ఇక ఓటే మన ఆయుధం!

# ఆ ఓట్లన్నీ "వైసీపీ" కే... ఎందుకో తెలుసా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత 2014 వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో టీడీపీ పార్టీ భారీ మెజారిటీని తెచ్చుకుంది. దానితో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత చంద్రబాబు నాయుడు అధ్యక్షతన టీడీపీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నెలకొల్పింది. ఇక వీరు తమ ఐదు సంవత్సరాల పరిపాలన కాలంలో చేసిన పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు పెద్దగా సంతృప్తి చెందలేదు. దానితో ఆ తర్వాత 2019 వ సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ పార్టీ కంటే వైసీపీ పార్టీ కి అత్యధిక మెజారిటీని ఆంధ్రప్రదేశ్ జనాలు ఇచ్చారు. దానితో వైయస్ రాజశేఖరరెడ్డి కుమారుడు అయినటువంటి జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన వైసీపీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఇక జగన్ సీఎం అయిన తర్వాత రైతులకి, పేద ప్రజలకు, మహిళలకు, నిరుద్యోగులకు ఏ స్థాయిలో అయితే ప్రాధాన్యతను ఇస్తూ వచ్చాడో ... ప్రభుత్వ ఉద్యోగులకు కూడా అదే స్థాయిలో ప్రాముఖ్యతను ఇస్తూ వచ్చాడు. దానితో ఈయనపై ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ప్రేమను చూపించడం మొదలు పెట్టారు. ఇక వచ్చే ఎన్నికలలో ప్రభుత్వ ఉద్యోగుల నుండి జగన్ కి భారీ మొత్తంలో ఓట్లు వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే మరి ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్స్ ద్వారానే వైసీపీ కి భారీ లీడ్ రాబోతున్నట్లు తెలుస్తోంది. మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 4.3 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్స్ ఉన్నాయి. అందులో 1.2 లక్షల సచివాలయం ఎంప్లాయిస్ ఓట్లు ఉండగా, రెండు లక్షల గవర్నమెంట్ ఎంప్లాయిస్, 40000 పోలీస్ అధికారులు, 28 అండర్ హోమ్ ఓటింగ్ కేటగిరి, 31 వేల అండర్ ఎసెన్షియల్ సర్వీస్ ఓట్లు ఉన్నాయి. ఈ ఓట్లలో మెజారిటీ ఓట్లు వైసీపీ కే పడబోతున్నట్లు తెలుస్తోంది.



# భారత బల్లెంవీరుడికి రజత పతకం!



భారత బల్లెంవీరుడు నీరజ్ చోప్రా రజత పతకంతో పారిస్ ఒలింపిక్స్ సన్నాహాలు ప్రారంభించాడు. డైమండ్ లీగ్ తొలి అంచె పోటీలో 88.36 మీటర్ల రికార్డు నమోదు చేశాడు. జావలిన్ త్రో ( బల్లెవిసురుడు ) లో ప్రపంచ, ఒలింపిక్ విజేత, భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా..పారిస్ ఒలింపిక్స్ స్వర్ణానికి గురిపెట్టాడు. యూరోప్ కేంద్రంగా గత కొద్దివారాలుగా శిక్షణ పొందుతున్న నీరజ్ ..2024 డైమండ్ లీగ్ దోహా అంచెపోటీలతో ఒలింపిక్స్ బంగారు పతకం వేటకు శ్రీకారం చుట్టాడు.

## 2 సెంటీమీటర్ల తేడాతో చేజారిన స్వర్ణం..

ఖతర్ రాజధాని దోహా వేదికగా జరిగిన డైమండ్ లీగ్ తొలి అంచెపోరులో 26 సంవత్సరాల నీరజ్ స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయాడు. చెక్ రిపబ్లిక్ కు చెందిన వెటరన్ అథ్లెట్ యాకోబ్ వాడ్లిచ్ కంటే 2 సెంటీమీటర్లు తక్కువ విసిరి రజత పతకంతో సరిపెట్టుకొన్నాడు. వాడ్లిచ్ 88. 38 మీటర్ల రికార్డుతో అగ్రస్థానంలో నిలిస్తే నీరజ్ మాత్రం 88.36 మీటర్ల దూరం మాత్రమే బల్లెం విసరగలిగాడు. వాడ్లిచ్ తన మూడో ప్రయత్నంలో 88. 38 మీటర్ల రికార్డు సాధించగలిగాడు. గతేడాది జరిగిన దోహా డైమండ్ లీగ్ అంచె పోటీలో బంగారు పతకం నెగ్గిన నీరజ్..తన ఆఖరి ప్రయత్నంలో వాడ్లిచ్ ను అధిగమించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ యాండర్సన్ పీటర్స్ 86. 62 మీటర్ల రికార్డుతో కాంస్య పతకంతో సరిపెట్టుకొన్నాడు.

## కిశోర్ కుమార్ జెనాకు 9వ స్థానం...

ఇదే టోర్నీలో తొలిసారిగా పాల్గొన్న భారత మరో అథ్లెట్ కిశోర్ కుమార్ జెనా 76. 31 మీటర్ల రికార్డుతో మూడోరౌండ్లోనే నిష్క్రమించాడు. తన ఆఖరి ప్రయత్నంలో 76. 31 మీటర్ల రికార్డుతో ఆఖరి నుంచి రెండోస్థానంలో నిలిచాడు. ప్రపంచంలోని పదిమంది అత్యుత్తమ బల్లెం వీరుల నడుమ జరిగిన ఈ పోరులో నీరజ్ 2వ స్థానం, జెనా 9వ స్థానం సాధించారు. హాంగ్జు ఆసియాక్రీడల్లో 87. 54 మీటర్ల రికార్డుతో రజత పతకం సాధించిన కిశోర్ కుమార్ జెనా..ప్రస్తుత డైమండ్ మీట్ తొలి అంచెలో విఫలమయ్యాడు. గతేడాది జరిగిన డైమండ్ లీగ్ తో పాటు..టోక్యో ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్షిప్ పోటీలలో నీరజ్ చోప్రా బంగారు పతకాలు సాధించగా..వాడ్లిచ్ ఒలింపిక్స్ లో రజత, ప్రపంచ మీట్ లో కాంస్య పతకాలు నెగ్గాడు. 2023-డైమండ్ లీగ్ దోహా అంచె పోటీలలో నీరజ్ చోప్రా 88.67 మీటర్ల రికార్డుతో బంగారు పతకం అందుకోగా 88.63 మీటర్లతో వాడ్లిచ్ రజత, 85.88 మీటర్ల రికార్డుతో పీటర్స్ కాంస్య పతకాలు అందుకొన్నారు. ప్రస్తుత సీజన్ తొలి టోర్నీలో నీరజ్ తన తొలి ప్రయత్నంలో ఫౌల్ కాగా..రెండో త్రోలో 84. 93 మీటర్లు, మూడో త్రోలో 86.24 మీటర్లు నమోదు చేశాడు. తన చివరి మూడు త్రోలలో నీరజ్ 86.18, 82.28 మీటర్లు, 88.38 మీటర్ల రికార్డులు సాధించాడు. 2022 సీజన్ డైమండ్ లీగ్ మూడు అంచెల్లో బంగారు పతకాలతో ఓవరాల్ చాంపియన్ గా నిలిచిన నీరజ్...మే 12 నుంచి భువనేశ్వర్ వేదికగా జరిగే ఫెడరేషన్ కప్ టోర్నీలో పాల్గొనున్నాడు. ఫెడరేషనకప్ జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ పోటీలలో నీరజ్ మూడేళ్ల విరామం తరువాత పాల్గొనబోతున్నాడు. 2021 మార్చి 17న జరిగిన ఫెడరేషన్ కప్ మీట్ లో నీరజ్ 87. 80 మీటర్ల రికార్డుతో బంగారు పతకం అందుకొన్నాడు. ఆ తరువాత నుంచి అంతర్జాతీయ టోర్నీలకు మాత్రమే పరిమితమయ్యాడు. జూన్ 18న ఫిన్లాండ్ వేదికగా జరిగే పావో నూర్మీ గేమ్స్,జులై 7న పారిస్ వేదికగా జరిగే డైమండ్ లీగ్ రెండో అంచె పోటీలో నీరజ్ పాల్గొనున్నాడు. బ్రసెల్స్ వేదికగా సెప్టెంబర్ 13, 14 తేదీలలో డైమండ్ లీగ్ చాంపియన్స్ ట్రోఫీని నిర్వహిస్తారు.

# అరుదైన ఘనత సాధించిన కేకేఆర్ ప్లేయర్ సునీల్ నరైన్



శనివారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో కోల్‌కలతా మ్యాచ్ ఆడింది. ఇందులో కోల్‌కోతా నైట్ రైడర్స్ టీమ్ 18 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో ఐపీఎల్-2024 సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన తొలి టీమ్‌గా కేకేఆర్ నిలిచింది. కాగా.. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 16 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ 157 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యార్ 21 బంతుల్లో 42 పరుగుల చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక బుమ్రా, పీయూష్ చావ్లా చెరో రెండు వికెట్లు తీశారు. 158 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబై.. పెద్దగా రాణించలేదు. ఓపెనర్ ఇషాన్ కిషన్ 22 బంతుల్లో 40 పరుగులు చేశాడు. ఇక తిలక్ వర్మ 17 బంతుల్లో 32 పరుగులు సాధించాడు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, రసెల్, హర్షిత్ రాణా తలో రెండు వికెట్లు తీశారు. సునీల్ నరైన్ ఒక వికెట్ తీసి 21 పరుగులు సమర్పించుకున్నాడు. ఫామ్‌లో ఆడుతూ.. స్కోర్‌ను పరుగులు పెట్టిస్తున్న ఇషాన్ కిషన్‌ను సునీల్ నరైన్ పెవిలియన్‌కు చేర్చాడు. దాంతో.. ఈ సీజన్‌లో సునీల్ నరైన్ 15వ వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలోనే సునీల్ నరైన అరుదైన ఘనతను అందుకున్నాడు. ఐపీఎల్ సీజన్‌లో 400కు పైగా పరుగులతో పాటు 15 వికెట్లు పడగొట్టిన మూడో ఆటగాడిగా చరిత్రకెక్కాడు. నరైన్ కంటే ముందే ఈ ఘనతను సాధించిన వారిలో షేన్ వాట్సన్, జాక్వెస్ కలిస్ ఉన్నారు. రాజస్థాన్ రాయల్స్ తరఫున 2008లో వాట్సన్ 472 పరుగులు చేసి.. 17 వికెట్లు తీసుకున్నాడు. ఇక 2012 సీజన్‌లో కేకేఆర్ తరఫున ఆడిన జాక్వెస్ కలిస్ 409 పరుగులు చేసి 15 వికెట్లు తీశాడు. ఈ సీజన్‌లో మోస్ట్ ఫామ్‌లో ఉన్న ప్లేయర్‌గా సునీల్ నరైన్ ఉన్నాడు. ఓపెనర్‌గా వస్తూ ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాడు. మరోవైపు బౌలింగ్‌లో కూడా రాణిస్తున్నాడు. 2024 సీజన్‌లో 12 మ్యాచ్‌లు ఆడిన సునీల్ నరైన్.. 38 సగటుతో 461 పరుగులు చేశాడు. అలాగే ఇప్పటికే 15 వికెట్లు తీశాడు. ముంబైతో మ్యాచ్ సందర్భంగా సునీల్ నరైన్ మరో ఘనతను కూడా సాధించాడు. మెన్స్ టీ20 క్రికెట్‌లో 550 వికెట్ల మైలురాయిని అందుకున్న మూడో బౌలర్‌గా నిలిచాడు. నరైన్ కంటే ముందు డ్వేన్ బ్రావో (325), రషీద్ ఖాన్ (574) వికెట్లతో ముందు స్థానాల్లో ఉన్నారు.

# ఓడినా పర్లేదు.. అందరికి ధోని కావాలంతే



ఇండియన్ ప్రీమియర్ లీగ్ హిస్టరీ లో ఛాంపియన్ జట్టుగా కొనసాగుతున్న చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి కొత్త సారధితో బలిలోకి దిగింది. ధోని కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో ఋతురాజ్ ఇక ఇప్పుడు ఆ జట్టుకు సారథిగా వ్యవహరిస్తూ ఉన్నాడు అని చెప్పాలి. ఇక అతనికి కెప్టెన్సీలో పరవాలేదు అనిపిస్తుంది చెన్నై సూపర్ కింగ్స్. ప్లే ఆఫ్ లో అడుగు పెట్టేలాగే కనిపిస్తుంది. అయితే ఇటీవల గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్లో ఏకంగా 35 పరుగుల తేడాతో చెన్నై జట్టు ఓడిపోయింది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చెన్నై సూపర్ కింగ్స్ ఓడిపోయినప్పటికీ ఆ జట్టు అభిమానులు మాత్రం ఎక్కడ నిరాశ పడలేదు. దీనికి కారణం అభిమానులందరికీ కావాల్సిన ధోని బ్యాటింగ్ చూశారు కాబట్టి. చివర్లో బ్యాటింగ్ చేయడానికి వచ్చిన ధోని 11 పంతులు 26 పరుగులు చేశాడు. అందులో ఒక ఫోర్ మూడు సిక్సర్లు ఉండడం గమనార్హం. మ్యాచ్ ఓడిపోతామని తెలిసినా ధోని బ్యాటింగ్ తో అభిమానులు అందరూ కూడా చివరి వరకు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు అని చెప్పాలి. అయితే ఇదే విషయం గురించి భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇక నుంచి మనం ధోని బ్యాటింగ్ స్థానంపై చర్చలు ఆపేయాలి. అతను ఏం చేయాలనుకుంటున్నాడు అనే విషయంపై పూర్తి అవగాహన ఉంది. ఎలా ఆడాలి అన్నది అతడి ఇష్టం. ఒకవేళ మీరు చెన్నై గెలవాలని కోరుకుంటే మాత్రం ఇప్పుడు ధోని ఆడుతున్న స్ట్రైక్ రేటుతో జట్టులోని మిగతా ప్లేయర్ లందరూ కూడా ఆడాలి. అప్పుడు సులువుగా చెన్నై గెలుస్తుంది. మ్యాచ్ను చూడటానికి వచ్చే అభిమానులు టికెట్ కొనుగోలు చేసిన మొత్తానికి ఎంటర్టైన్మెంట్ దొరికినట్లే. మైదానం నలువైపులా భారీ షాట్లతో విరుచుకుపడుతూ బౌండరీల వర్షం కురిపిస్తున్నాడు ధోని. తమ జట్టు విజయం సాధించిన ఓడిపోయిన వారికి అవసరం లేదు. ధోని బాగా ఆడితే చాలు. ప్రేక్షకులు దీనిని చూసేందుకే వస్తున్నారు. ఇక ధోని కూడా అభిమానులను ఎంటర్టైన్ చేయించేందుకు ఆడుతున్నాడు అంటూ వీరేంద్ర సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు.

# ముంబై అవుట్..ఐపీఎల్ ప్లే- ఆఫ్ రౌండ్లో కోల్ కతా!



ఐపీఎల్ -17వ సీజన్ ప్లే-ఆఫ్ రౌండ్ చేరిన తొలిజట్టుగా రెండుసార్లు విజేత కోల్ కతా నైట్ రైడర్స్ నిలిచింది.మాజీ చాంపియన్ ముంబైని 18 పరుగులతో కోల్ కతా చిత్తు చేసింది. ఐపీఎల్-2024 సీజన్ ప్లే-ఆఫ్ రౌండ్ చేరిన తొలిజట్టు ఘనతను మాజీ చాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్ దక్కించుకొంది. హోంగ్రౌండ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా వర్షం దెబ్బతో 16 ఓవర్ల మ్యాచ్ గా సాగిన 13వ రౌండ్ పోరులో ఐదుసార్లు విజేత ముంబై ఇండియన్స్ ను కోల్ కతా 18 పరుగులతో అధిగమించింది. మొత్తం 12 రౌండ్లలో 9 విజయాలు, 3 పరాజయాల రికార్డుతో 18 పాయింట్లు సాధించడం ద్వారా లీగ్ టేబుల్ టాపర్ గా నిలవడమే కాదు...ప్లే-ఆఫ్ రౌండ్ బెర్త్ ను సైతం ఖాయం చేసుకోగలిగింది.

### ముంబై..షరామామూలే....

రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, తిలకవర్మ, బుమ్రా లాంటి మేటి ఆటగాళ్లున్న ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ పరిస్థితి ఇంత బతుకూ బతికి.... అన్నట్లుగా తయారయ్యింది. 13వ రౌండ్ మ్యాచ్ లో సైతం పరాజయం పాలై..లీగ్ టేబుల్ ఆఖరునుంచి 2వ స్థానంలో నిలిచింది. కోల్ కతా నైట్ రైడర్స్-ముంబై ఇండియన్స్ జట్ల నడుమ జరిగిన ఈ మ్యాచ్ కు వానదెబ్బ తగలడంతో మ్యాచ్ ను 16 పరిమిత ఓవర్లకు కుదించి నిర్వహించారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ కు దిగిన ఆతిథ్య కోల్ కతా 16 ఓవర్లలో 7 వికెట్లకు 157 పరుగులు సాధించింది.

### యార్కర్ల కింగ్ అరుదైన రికార్డు...

ఇప్పటికే ప్లే-ఆఫ్ రౌండ్ చేరే అవకాశాలను చేజార్చుకొన్న ముంబై..అంతగా ప్రాధాన్యం లేని ఈ మ్యాచ్ లో టాస్ నెగ్గి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకొంది. కోల్ కతా స్టార్ ఓపెనర్ సునీల్ నరైన్ ను రెండోఓవర్లోనే ఓ సూపర్ స్వింగర్ తో యార్కర్లకింగ్ జస్ ప్రీత్ బుమ్రా పడగొట్టడం ద్వారా తనజట్టుకు చక్కటి ఆరంభాన్ని ఇచ్చాడు. ప్రస్తుత సీజన్లో ఓ సెంచరీతో సహా 400కు పైగా పరుగులు సాధించడం ద్వారా కోల్ కతా తురుపుముక్కగా మారిన సునీల్ నరైన్ డకౌట్ కావడం ద్వారా ఓ చెత్త రికార్డును మూటగట్టుకొన్నాడు. తన టీ-20 కెరియర్ లో 44వసారి డకౌటయ్యాడు. అయితే..మరో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ 21 బంతుల్లో 42, రింకూ సింగ్ 12 బంతుల్లో 20 పరుగులు, యాంద్రీ రస్సెల్ 14 బంతుల్లో 24 పరుగులు, నితీశ్ రాణా 23 బంతుల్లో 33 పరుగులు చేయడంతో కోల్ కతా 157 పరుగుల స్కోరు సాధించగలిగింది. మరోవైపు ముంబై స్టార్ బౌలర్ బుమ్రా తన కోటా 4 ఓవర్లలో 39 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టడం ద్వారా ఆరెంజ్ క్యాప్ ను కైవసం చేసుకోగలిగాడు. లెగ్ స్పిన్నర్ పియూశ్ చావ్లా 3 ఓవర్లలో 28 పరుగులిచ్చి 2 వికెట్లు సాధించాడు.

### జస్ ప్రీత్ బుమ్రా కు ఆరెంజ్ క్యాప్....

ప్రస్తుత సీజన్ లీగ్ మొదటి 13 రౌండ్ల మ్యాచ్ ల్లో 20 వికెట్లు పడగొట్టడం ద్వారా బుమ్రా ఆరెంజ్ క్యాప్ ను అందుకొన్నాడు. తన కెరియర్ లో ఓ సీజన్లో 20 వికెట్లు పడగొట్టడం బుమ్రాకు ఇది నాలుగోసారి. 2017, 2022, 2021 సీజన్లలో 20కి పైగా వికెట్లు పడగొట్టిన బుమ్రా ప్రస్తుత 2024 సీజన్లో సైతం 20 వికెట్ల ఘనత సాధించగలిగాడు.

### చేజింగ్ లో ముంబై విఫలం...

158 పరుగుల టార్గెట్ తో చేజింగ్ కు దిగిన ముంబైకి ఓపెనింగ్ జోడీ రోహిత్ శర్మ- ఇషాన్ కిషన్ మొదటి వికెట్ కు 50 పరుగుల భాగస్వామ్యంతో చక్కటి ఆరంభాన్ని ఇచ్చినా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఇషాన్ కిషన్ 40, రోహిత్ 24 బంతుల్లో 19 పరుగుల స్కోర్లకు అవుటయ్యారు. ముంబై తురుపుముక్క సూర్యకుమార్ యాదవ్ సైతం తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. తిలక్ వర్మ 17 బంతుల్లో 32 పరుగులు సాధించినా ముంబై 16 ఓవర్లలో 8 వికెట్లకు 139 పరుగులు మాత్రమే చేయగలిగింది. లీగ్ లో ఇప్పటి వరకూ ఆడిన 13 రౌండ్లలో ముంబై 4 విజయాలు, 9 పరాజయాల రికార్డుతో డీలా పడిపోయింది. ఈరోజు జరిగే మరో కీలక పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఢిల్లీ క్యాపిటల్స్ అమీతుమీ తేల్చుకోనుంది. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే ఈ మ్యాచ్ లో నెగ్గినజట్టుకే ప్లే-ఆఫ్ రౌండ్ చేరే అవకాశాలు ఉంటాయి. ఢిల్లీ కెప్టెన్ రిషభ్ పంత్ ఓ మ్యాచ్ సస్పెన్షన్ కు గురికావడంతో..స్పిన్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. ఈ మ్యాచ్ లో సైతం భారీ స్కోరు సాధించడం ద్వారా సరికొత్త రికార్డు నెలకొల్పడానికి బెంగళూరు ఓపెనర్ విరాట్ కోహ్లీ తహతహలాడుతున్నాడు. లీగ్ టేబుల్ 5వ స్థానంలో నిలిచిన ఢిల్లీకి మాత్రమే కాదు...7వ స్థానంలో కొనసాగుతున్న బెంగళూరుకు సైతం ఈ మ్యాచ్ డూ ఆర్ డై లాంటిదే.

# చెన్నై ఓడినా...మహీ సిక్సర్ల రికార్డు!

ఐపీఎల్ కురువృద్ధుడు మహేంద్ర సింగ్ ధోనీ ఓ అరుదైన క్లబ్ లో చోటు సంపాదించాడు.గుజరాత్ టైటాన్స్ పై ఈ ఘనత సాధించాడు.. ఐపీఎల్-17వ సీజన్ డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ దశ పోటీలు ముగియటానికి మరికొద్ది మ్యాచ్ లు మాత్రమే మిగిలి ఉండడంతో..చివరి దశ మ్యాచ్ లు కీలకంగా మారాయి. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ప్రారంభంలో చూపిన జోరు..10వరౌండ్ తరువాత నుంచి చూపలేకపోతోంది. అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్ తో జరిగిన కీలక 12వ రౌండ్ మ్యాచ్ లో సైతం చెన్నై ఓటమి పొందడంతో లీగ్ టేబుల్ 4వ స్థానానికి పడిపోయింది. 12 రౌండ్లలో 6 విజయాలు, 6 పరాజయాలతో.. ప్లే - ఆఫ్ రౌండ్ అవకాశాలను మరింత క్లిష్టం చేసుకొంది. ఆఖరి రెండురౌండ్లలోనూ నెగ్గితేనే..ప్లే-ఆఫ్ రౌండ్ చేరే పరిస్థితిని కొని తెచ్చుకొంది.




### హైస్కోరింగ్ వార్ లో చెన్నై ఓటమి..

గుజరాత్ టైటాన్స్ తో జరిగిన ఈ పోరులో చెన్నై బౌలర్లు 231 పరుగులు సమర్పించుకొన్నారు. ఓపెనింగ్ జోడీ సాయి సుదర్శన్- శుభ్ మన్ గిల్ డబుల్ సెంచరీ భాగస్వామ్యంతో పాటు..వ్యక్తిగతంగానూ చెరో సెంచరీ బాదడంతో చెన్నై ఓటమి ఊబిలో కూరుకుపోయింది. 232 పరుగుల లక్ష్యంతో చేజింగ్ కు దిగిన చెన్నై20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనింగ్ జోడీ రహానే, రచిన్ రవీంద్ర చెరో పరుగు మాత్రమే చేయగా..వన్ డౌన్ రుతురాజ్ గయక్వాడ్ డకౌట్ కావడంతో..చెన్నై మరి కోలుకోలేకపోయింది. 2.5 ఓవర్లలో కేవలం 10 పరుగులకే 3 టాపార్డర్ వికెట్లు నష్టపోయి ఎదురీత మొదలు పెట్టింది. ఇన్నింగ్స్ చివర్లో వెటరన్ ధోనీ 11 బంతుల్లో ఓ ఫోరు, 3 సిక్సర్లతో మెరుపులు మెరిపించినా, 26 పరుగుల నాటౌట్ స్కోరు సాధించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు 35 పరుగుల పరాజయం తప్పలేదు.

### 250 సిక్సర్ల క్లబ్ లో ధోనీ..

ఐపీఎల్ 17 సీజన్ల చరిత్రలో 250 సిక్సర్ల మైలురాయిని చేరిన భారత మూడో బ్యాటర్ గా మహేంద్రసింగ్ ధోనీ రికార్డుల్లో చేరాడు. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన 12వ రౌండ్ మ్యాచ్ లో ధోనీ 3 సిక్సర్లతో..26 పరుగుల స్కోరుతో అజేయంగా నిలిచాడు. తన రెండో సిక్సర్ బాదడంతోనే 250 సిక్సర్ల రికార్డును పూర్తి చేయగలిగాడు. తన ఐపీఎల్ కెరియర్ లో ధోనీ బాదిన సిక్సర్ల సంఖ్య 251కి చేరింది. బెంగళూరు రాయల్ చాలెంజర్స్ మాజీ బ్యాటర్ ఏబీ డివిలియర్స్ 251 సిక్సర్ల రికార్డును ధోనీ సమం చేయగలిగాడు. డివిలియర్స్ 170 ఇన్నింగ్స్ లోనే 250 సిక్సర్లు సాధిస్తే...ధోనీ మాత్రం 228 ఇన్నింగ్స్ ఆడాల్సి వచ్చింది.

### సిక్సర్ల బాదుడులో టాపర్ రోహిత్ శర్మ...

ఐపీఎల్ లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత బ్యాటర్ల వరుసలో మొదటి రెండుస్థానాలను రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆక్రమించారు. రోహిత్ 250 ఇన్నింగ్స్ లో 276 సిక్సర్లతో అగ్రస్థానంలో నిలిస్తే..విరాట్ 241 ఇన్నింగ్స్ లో 264 సిక్సర్లతో రెండోస్థానంలో కొనసాగుతున్నాడు. ధోనీ 251 సిక్సర్లతో మూడోస్థానం సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్ రికార్డు మాత్రం క్రిస్ గేల్ పేరుతో ఉంది. బెంగళూరు రాయల్ చాలెంజర్స్ మాజీ ఓపెనర్ గేల్ 141 ఇన్నింగ్స్ లో 357 సిక్సర్లు బాదిన మొనగాడిగా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలోనే సిక్సర్లు బాదిన మొదటి ఐదుగురు బ్యాటర్లలో గేల్, రోహిత్,విరాట్, ధోనీ, డేవిడ్ వార్నర్ ( 236 సిక్సర్లు ) నిలిచారు.

### 1063కు చేరిన సిక్సర్లు...

ప్రస్తుత సీజన్ లీగ్ మొదటి 59 మ్యాచ్ లు ముగిసే సమయానికే సిక్సర్ల సంఖ్య 1063 చేరింది. 2008 నుంచి 2024 వరకూ జరిగిన ఐపీఎల్ లో ఇదే అత్యుత్తమ రికార్డు కావడం విశేషం. 2023 సీజన్ లీగ్ లో నమోదైన 1124 సిక్సర్ల ఆల్ టైమ్ గ్రేట్ రికార్డు..ప్రస్తుత సీజన్లో తెరమరుగయ్యే అవకాశం ఉంది. అహ్మదాబాద్ వేదికగా ముగిసిన ఈ మ్యాచ్ లో రెండుజట్లు కలసి మొత్తం 25 సిక్సర్లు బాదడంతో రెండో అత్యుత్తమ రికార్డు నమోదయ్యింది.

# భారత చీఫ్ కోచ్ గా ద్రావిడ్ కు పొడిగింపు లేనట్లే!

భారత క్రికెట్ జట్టు సరికొత్త ప్రధాన శిక్షకుడి కోసం బీసీసీఐ త్వరలోనే ఓ ప్రకటన విడుదల చేయనుంది. 2024 జులై నెలలో కొత్త కోచ్ నియామకం జరుగనుంది. ప్రపంచంలోనే అత్యంత భాగ్యవంతమైన క్రికెట్ బోర్డు బీసీసీఐ..సరికొత్త చీఫ్ కోచ్ కోసం త్వరలో వేట మొదలు పెట్టనుంది. ప్రస్తుత చీఫ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ కాంట్రాక్టును పొడిగించే ఉద్దేశం లేదని బీసీసీఐ కార్యదర్శి జే షా ప్రకటించారు.



### ప్రపంచకప్ వరకే ద్రావిడ్ కాంట్రాక్టు..

భారతజట్టు ప్రధాన శిక్షకుడిగా 2021 నవంబర్ లో రవిశాస్త్రి నుంచి పగ్గాలు చేపట్టిన ప్రస్తుత చీఫ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ కాంట్రాక్టు జూన్ లో జరిగే టీ-20 ప్రపంచకప్ తో ముగియనుంది. భారత్ వేదికగా జరిగిన ఐసీసీ వన్డే ప్రపంచకప్ తోనే చీఫ్ కోచ్ గా ద్రావిడ్ కాంట్రాక్టు ముగిసింది. అయితే ప్రపంచకప్ లో భారత్ ఆటతీరు, ఫైనల్స్ చేరడం, రన్నరప్ గా నిలవడం లాంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని..టీ-20 ప్రపంచకప్ వరకూ ద్రావిడ్ ను చీఫ్ కోచ్ గా కొనసాగిస్తున్నట్లు గతంలోనే బీసీసీఐ ప్రకటించింది. అయితే..టీ-20 ప్రపంచకప్ ముగిసిన వెంటనే రాహుల్ ద్రావిడ్ నేతృత్వంలోని శిక్షకుల బృందం కాంట్రాక్టు ముగిసిపోతుందని, భారత చీఫ్ కోచ్ కోసం త్వరలోనే దరఖాస్తులు ఆహ్వానిస్తామని, కావాలనుకుంటే రాహుల్ ద్రావిడ్ సైతం మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని బీసీసీఐ కార్యదర్శి ముంబైలో వివరించారు.

### ఫార్మాట్ కు ఓ కోచ్ ఆలోచన లేదు...

టీ-20, టెస్టు, వన్డే ...ఇలా మూడు ఫార్మాట్లకు ముగ్గురు వేర్వేరు కోచ్ లను నియమించే ఆలోచన బీసీసీఐకి లేదని, ప్రస్తుత ఐపీఎల్ ను అతలాకుతలం చేసిన ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను ప్రయోగాత్మకంగా మాత్రమే అమలు చేస్తున్నామని, ఆల్ రౌండర్ల పాలిట శాపంగా మారిన ఈ నిబంధనను వచ్చే సీజన్లో కొనసాగించేది లేనిదీ..అన్ని వర్గాలతో చర్చించి ఒక నిర్ణయం తీసుకొంటామని జే షా తెలిపారు.

### ఏడాదికి 12 కోట్ల రూపాయల వేతనం...

భారత టెస్టు, వన్డే, టీ-20 జట్లకు ప్రధాన శిక్షకుడిగా వ్యవహరిస్తున్న రాహుల్ ద్రావిడ్ కు బీసీసీఐ ఏడాదికి 12కోట్ల రూపాయల చొప్పున జీతం చెల్లిస్తోంది. అంటే ద్రావిడ్ నెలకు కోటిరూపాయల చొప్పున వేతనం అందుకొంటూ తన సేవలు అందిస్తున్నాడు. రాహుల్ ద్రావిడ్ అందుబాటులో లేని సమయంలో భారతజట్టుకు తాత్కాలిక కోచ్ గా వ్యవహరిస్తున్న వీవీఎస్ లక్ష్మణ్ కు నెలకు 50 లక్షల రూపాయల చొప్పున చెల్లిస్తోంది.

### రోహిత్, విరాట్ లను మించిన ద్రావిడ్...

భారత కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ కమ్ దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లీలను మించి రాహుల్ ద్రావిడ్ కే బీసీసీఐ అధికంగా జీతం చెల్లిస్తోంది. బీసీసీఐ నుంచి వార్షిక కాంట్రాక్టు ద్వారా ఏడాదికి 7 కోట్ల రూపాయల చొప్పున..రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వేతనంగా అందుకొంటున్నారు. అయితే..గాయాలు, ఫిట్ నెస్ సమస్యలతో మ్యాచ్ లు ఆడకపోయినా ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అదే భారత ప్రధాన శిక్షకుడిగా రాహుల్ ద్రావిడ్ మాత్రం కెప్టెన్ రోహిత్, మాజీ కెప్టెన్ కోహ్లీల కంటే 5 కోట్ల రూపాయలు ఎక్కువగా ఆర్జిస్తున్నాడు. గతంలో భారత్ కు చీఫ్ కోచ్ గా వ్యవహరించిన అనిల్ కుంబ్లే 7 కోట్ల రూపాయలు, రవిశాస్త్రి 9 కోట్ల 50 లక్షల రూపాయలు చొప్పున వేతనం అందుకొన్నారు. భారత చీఫ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ తర్వాత..అత్యధిక వేతనం అందుకొన్న క్రికెట్ శిక్షకుడిగా ఆస్ట్రేలియా మాజీ కోచ్ జస్టిన్ లాంగర్ నిలిచాడు. లాంగర్ జీతం 4 కోట్ల 50 లక్షల రూపాయలు మాత్రమే.

మొత్తం మీద..భారత్ తరపున 100కు పైగా టెస్టులు, 200కు పైగా వన్డేలు ఆడిన సమయంలో సంపాదించలేని మొత్తాన్ని రాహుల్ ద్రావిడ్..రిటైర్మెంట్ తర్వాత చీఫ్ కోచ్ గా సంపాదిస్తూ వారేవ్వా అనిపించుకొంటున్నాడు. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక వేతనం అందుకొంటున్న ప్రధాన శిక్షకుడు ఎవరంటే రాహుల్ ద్రావిడ్ మాత్రమే అని చెప్పక తప్పదు.

# ఏపీలో మారుతున్న సీన్.. ప్రశాంత్ కిషోర్ తాజా అంచనా



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలపై రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ మరోసారి తన అంచనాను తెలియజేశారు. అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలవుతుందని చెప్పారు. ఈ విషయాన్ని తాను 18 నెలల కిందటే జగన్ కు చెప్పానన్నారు. ఆర్టీవీ కోసం రవిప్రకాష్ కు ప్రశాంత్ కిషోర్ ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఏపీ రాజకీయాల్లో తాను వైఎస్ జగన్ తో పనిచేసిన అనుభవాన్ని, ఆలోచనలను పంచుకున్నారు.

## పార్టీ క్యాడర్ నిర్వీర్యమైంది

అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ పూర్తిగా దారి తప్పారని, వాలంటీర్లను నియమించుకోవడం అనేది తన ఆలోచన కాదని, ఆ వ్యవస్థద్వారా పార్టీ క్యాడర్ నిర్వీర్యమైందన్నారు. ఐప్యాక్ కోసం తాను ప్రస్తుతం పనిచేయడంలేదని పీకే స్పష్టం చేశారు. తాను అందరి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నానని, ఎందుకు గెలవను అని వాదించారన్నారు. 155 సీట్లు గెలవబోతున్నట్లు చెప్పారన్నారు. ఆ తర్వాత తాను ఇంతవరకు జగన్ ను కలవలేదని, పాలనలో ఎన్నో తప్పులున్నాయని, దానివల్ల వైసీపీ భారీగా నష్టపోతోందన్నారు.

## 151 నుంచి 51కి తెస్తున్నారు

సజ్జల రామకృష్ణారెడ్డిలాంటివారు 151 సీట్ల పార్టీని 51 సీట్లకు తీసుకు వస్తున్నారని, తాను ఎవరు డబ్బులు ఇస్తే వారిపై మాట్లాడుతానని వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. దీనిపై ఆయన సెటైర్ వేశారు. జగన్ మోహన్ రెడ్డి తల్లి విజయమ్మ జగన్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆమె ఎవరి దగ్గర డబ్బులు తీసుకున్నారో తెలుసుకోవాలని పీకే వ్యాఖ్యానించారు. బొత్స సత్యనారాయణ తనపై చేసిన విమర్శలపైనా ఆయన స్పందించారు. బొత్స టీడీపీలోకి వెళ్లడానికి ఒప్పందం చేసుకున్నారనే సంచలన విషయం బయట పెట్టారు. గెలిచిన పార్టీలోనే ఉండాలని బొత్స అనుకుంటారని, మూడు రాజధానులకు సంబంధించిన ఆలోచన కూడా తనది కాదని, 2019లో వైసీపీ విజయం సాధించిన తర్వాత తాను ఇంతవరకు సేవలందించలేదని, ఐప్యాక్ మాత్రం ఇప్పటికీ అందిస్తోందన్నారు.

# ప్రధాని రేసులో ఉన్నారా.. కేజ్రీవాల్ రియాక్షన్ ఇదే!



లోక్‌సభ ఎన్నిక ల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఢిల్లీ సీఎం కోర్టులో పిటిషన్ దాఖలుచేయగా విచారణ జరిపిన ధర్మాసనం అరవింద్ కేజ్రీవాల్ కి బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్ పై విడుదలైన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తీరిక లేకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఇండియా కూటమి తరఫున ప్రధాని రేసులో ఉన్నారా అని కేజీవాల్ను ప్రశ్నించగా.. తాను లేనని బదులిచ్చారు. కేంద్రంలో కూటమి అధికారంలోకి వస్తే ఆప్ గ్యారంటీలను అమలు చేసే బాధ్యత తనదని ఆయన హామీ ఇచ్చారు. కాగా, లిక్కర్ పాలసీ కేసులో ఆయనను మార్చిలో ఈడీ అధికారులు అరెస్ట్ చేయడంతో ఇన్నాళ్లు తిహార్ జైలులో ఉన్నారు. జూన్ 1 వరకు కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న తప్పనిసరిగా సరెండర్ కావాలని ఆదేశం ఇచ్చింది. అయితే సుప్రీం కోర్టు అరవింద్ కేజ్రీవాల్ కి కొన్ని షరతులు విధించింది.

# సోమవారం పోటీపడుతున్న ప్రముఖులు వీరే



దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే మూడు విడతల పోలింగ్ ముగిసింది. సోమవారం నాల్గో విడత పోలింగ్ జరగనుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు మరో 10 రాష్ట్రాల్లో పోలింగ్ జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో మాత్రం కేవలం పార్లమెంట్ ఎన్నికలకే ఓటింగ్ జరగనుంది. ఏపీలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఏపీలో అధికార వైసీపీ-కూటమితో నువ్వానేనా అన్నట్టుగా ఫైటింగ్ సాగుతోంది. ఇప్పటికే పెద్ద ఎత్తున ఓటర్లంతా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. రైళ్లు, బస్సులు, విమానాలు, కార్లు ఏపీ వైపే ఎక్కువగా వెళ్తున్నాయి. అయితే సోమవారం జరగబోయే నాల్గో దశ పోలింగ్‌లో పలువురు ప్రముఖులు బరిలో ఉన్నారు. ఏపీలో పులివెందుల నుంచి సీఎం జగన్, కుప్పం నుంచి చంద్రబాబు, మంగళగిరి నుంచి నారా లోకేశ్, పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్, రాజంపేట లోక్‌సభ నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజమండ్రి లోక్‌సభ నుంచి పురందేశ్వరి, కడప లోక్‌సభ నుంచి వైఎస్.షర్మిల పోటీలో ఉన్నారు. ఇక తెలంగాణలో సికింద్రాబాద్ నుంచి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి అరవింద్ బరిలో ఉన్నారు. ఇక ఆయా రాష్ట్రాల్లో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో పాటు, తృణమూల్ కాంగ్రెస్ నేతలు మహువా మోయిత్రా (కృష్ణానగర్, పశ్చిమబెంగాల్), శత్రుఘ్న సిన్హా (అసన్సోల్, పశ్చిమ బెంగాల్), బీజేపీ అగ్రనేతలు గిరిరాజ్ సింగ్ (బెగుసరాయ్, బీహార్), అర్జున్ ముండా (ఖుంటి, జార?ండ్) నాలుగో విడతలో పేరుగాంచిన రాజకీయ నాయకులు ఎన్నికల బరిలో ఉన్నారు.

## నాల్గో దశలో లోక్‌సభ స్థానాలు ఇవే..

ఏపీ (25), తెలంగాణ (17), బీహార్ (5), జార?ండ్ (4), మధ్యప్రదేశ్ (8), మహారాష్ట్ర (11), ఒడిశా (4), యూపీ (13), పశ్చిమ బెంగాల్ (8), జమ్మూ - కాశ్మీర్ (1) లోక్‌సభ నియోజకవర్గాలలో ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది. ఇప్పటికే మూడు విడతల పోలింగ్ ముగిసింది. నాల్గో విడత సోమవారం జరగనుంది. అనంతరం మే 20, 25, జూన్ 1న జరగనుంది. ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదలకానున్నాయి.

# రాహుల్ పై స్మృతి ఇరానీ ఫైర్.. నువ్వేమైన ప్రధాని అభ్యర్థివా..



సార్వత్రిక ఎన్నికల వేళ ఎన్డీఏ, ఇండియా కూటమి నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ నేతలు తీవ్రంగా విమర్శించుకుంటున్నారు. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ నాయకురాలు, ఎంపీ అభ్యర్థి స్మృతి ఇరానీ ఫైర్ అయ్యారు. ఎన్నికల అంశాలపై ప్రధాని మోడీతో బహిరంగా చర్చకు తాను సిద్ధమని రాహుల్ తరచూ ప్రకటిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్మృతి ఇరానీ కౌంటర్ వేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో చర్చించడానికి రాహుల్ గాంధీ ఏమైనా విపక్షాల కూటమికి ప్రధాని అభ్యర్థిగా ఉన్నారా? అని ప్రశ్నించారు. తమ కంచుకోటలా భావించే నియోజకవర్గంలో ఓ సాధారణ బీజేపీ కార్యకర్తపై కూడా పోటీ చేసే ధైర్యం లేని వ్యక్తి ప్రగల్భాలు పలకడం మానుకోవాలని సూచించారు. ఇక ప్రధానితో భేటీ అయి, ఆయనతో డిబేట్ చేసే స్థాయి రాహుల్‌కి ఉందా అంటూ ఎద్దేవా చేశారు. ఈ చర్చల వల్ల తమ పార్టీ విజన్‌ను ప్రజలు అర్థం చేసుకునేందుకు వీలుంటుందని.. సరైన సమాచారం ప్రజలకు చేరుతుందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ చర్చకు తాను కానీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కానీ పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓ వేదికపై బహిరంగ చర్చకు రావాలని ద హిందూ మాజీ సంపాదకుడు ఎన్ రామ్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ లోకూర్, ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఏపీ షాలు మూడు రోజుల క్రితం నేతలిద్దరికి లేఖలు రాశారు. వాణిజ్యేతర, పార్టీయేతర వేదికపై ఈ చర్చను జరపాలని, ఇలాంటి బహిరంగ చర్చ కారణంగా ప్రజలకు అవగాహన ఏర్పడటమే కాకుండా ఒక ఆరోగ్యకరమైన, శక్తివంతమైన ప్రజాస్వామ్యాన్ని ప్రదర్శించడంలో గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు.

# ఈ నగరం కిందంతా భూగర్భ సొరంగాలే.. మరి వాటిపై భారీ భవనాలు ఎలా కడుతున్నారు



ఆక్లాండ్ నగరం న్యూజీలాండ్‌లోని అతిపెద్ద నగరం ఆక్లాండ్. దీని కింద లావా సొరంగాల నెట్‌వర్క్ విస్తరించి ఉంది. సెంట్రల్ ఆక్లాండ్ మైదానంలో హెచ్చరిక బోర్డులు ఉన్నాయి. 70,000 ఏళ్ల కిందట ఏర్పడిన లావా సొరంగానికి అక్కడ మార్గం ఉన్నట్లు ఆ బోర్డు సూచిస్తోంది. ఆక్లాండ్ నగరం కింద విస్తరించి ఉన్న వందల లావా సొరంగాలలో ఇదొకటి. అంతకుముందు ఎవరూ గుర్తించని సొరంగాలు బయటపడటంతో అవి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియజేసే ఒక మ్యాపింగ్ ప్రాజెక్టును చేపట్టింది న్యూజీలాండ్ ప్రభుత్వం. "క్రియాశీల అగ్నిపర్వతాలు అధికంగా ఉండే ఒక మైదానం మీద ఆక్లాండ్ నగరాన్ని నిర్మించారు. ఇది చాలా ప్రత్యేక , ఇలాంటిది ఎక్కడా లేదు" అని ఆక్లాండ్ కౌన్సిల్ జియోహెరిటేజ్, నేచురల్ ఫీచర్స్ ఎక్స్‌పర్ట్ కేట్ లెవీస్ చెప్పారు. అందుకే, విస్ఫోటనాల తర్వాత ఏర్పడిన సొరంగాలను గుర్తించి, వాటిని సంరక్షించడం అత్యంత కీలకమని, సవాలుతో కూడుకున్న విషయమని అన్నారు. ఈ సొరంగాల్లో మనం తెలుసుకోవాల్సిన అనేక అంశాలు ఉంటాయని ఆమె అన్నారు. మేం నిల్చున్న సొరంగం 70 వేల ఏళ్ల కిందట ఏర్పడింది. దానిమీద అనేక రాళ్లు ఉన్నాయి. మధ్య మధ్యలో మట్టి, ఫెర్న్ మొక్కలు కనిపిస్తున్నాయి. నగరంలోని ఈ సొరంగాలన్నీ గత 2 లక్షల ఏళ్లుగా తరచూ విస్ఫోటనం చెందుతూ వస్తున్న అగ్ని పర్వతాల వల్ల ఏర్పడినవే. ఇందులో తాజాగా ఏర్పడింది రంగిటొటో అగ్నిపర్వతం పేలుడు వల్ల ఏర్పడింది. ఆక్లాండ్‌లో గత 550 సంవత్సరాలలో రెండుసార్లు పేలిన ఒకే ఒక్క పర్వతం ఇది. "లావా సొరంగాలనేవి



ఖాళీ లావా గొట్టాలు. కరుగుతున్న లావా భూమిలోపల ప్రవహించినప్పుడు ఇవి ఏర్పడుతుంటాయి" అని కాలిఫోర్నియాలోని మోంటెరే బే అక్వేరియం రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వోల్కనోలజిస్ట్ డేవిడ్ క్లాగ్ తెలిపారు. శక్తిమంతమైన విస్ఫోటనాల సమయంలో మోల్టెన్ రాక్ భూమిపైకి వస్తుంది. అది చల్లబడటానికి ముందు, కిందకి కదులుతూ క్రస్ట్ ఏర్పడుతుంది. చాలా వరకు లావా ప్రవాహాల్లో సొరంగాలు ఏర్పడతాయి. చాలా వరకు ఈ లావాలు ద్రవ రూపంలో ఉండి, వేగంగా ప్రవహిస్తాయని క్లాగ్ చెప్పారు. లావా సొరంగాలు చూడటానికి వింతగా కనిపించే భౌగోళిక రూపాలు మాత్రమే కాదు. లక్షల ఏళ్లుగా వీటికి ఎంతో ప్రాధాన్యత కూడా ఉంది. ఆక్లాండ్‌లో ఉన్న పొడవైన లావా సొరంగం 290 మీటర్లు ఉంది. ఉత్తర అమెరికాలోని హవాయి, కాలిఫోర్నియా, న్యూమెక్సికో, అరిజోనా, ఒరెగాన్ వంటి ప్రాంతాలలో ఇలాంటి సొరంగాలు కనిపిస్తాయి. ఇడాహోలో ఉన్న బాబ్‌కాట్ కేవ్‌లోని ఈ సొరంగాలను స్థానిక అమెరికన్లు అవసరమైన సమయాల్లో ఫ్రిడ్జ్‌గా ఉపయోగించుకునేవారు. జంతువులను వేటాడి జీవించే రోజుల్లో అడవి దున్న మాంసాన్ని దానిలో దాచిపెట్టుకునే వారు. న్యూజీలాండ్ మావోరి తెగ పూర్వీకులు ఆక్లాండ్ సొరంగాలను పవిత్రమైనవిగా భావించే వారు. చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించే ప్రాంతాలుగా కూడా వాడేవారు. అయితే, కొత్త వ్యక్తులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు వీటిని సరిగా గౌరవించేవారు కాదని స్థానిక మావోరి తెగ వారసత్వ అభ్యాసకుడు మాల్కోమ్ పాటర్సన్ తెలిపారు. ఈయన ఆక్లాండ్ ప్రాంతానికి చెందినవారు. ఈ సొరంగాల కింద 1940ల్లో రహస్యంగా నడిపిన కమ్యూనిస్ట్ ప్రింటింగ్ ప్రెస్‌ను కూడా గుర్తించారు. జాక్సన్ ఇన్‌గోల్డ్, కేట్ లెవిస్ ఇక్కడ సొరంగాలను గుర్తించి, తవ్వుతున్న సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే బాధ్యతను లెవీస్ టీమ్‌కు అప్పజెప్పారు. ప్రైవేట్ భూముల్లో గుర్తించిన సొరంగాలను ఎలా మెయింటెయిన్ చేయాలి? అనేది వీరి ముందున్న సవాలు. నగరంలో 90 శాతం భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే ఉంది. అనుకోకుండా బయటపడ్డ సొరంగాల, వస్తువుల కోసం "యాక్సిడెంటల్ డిస్కవరీ రూల్" అనేది ఒకటి ఉంది. సమాధుల్లో మనుషుల అస్థిపంజరాలను లేదా ప్రమాదకర వ్యర్థాలను లేదా పురావస్తు ప్రాంతాన్ని కనుగొంటే అనుసరించే ప్రక్రియనే ఇక్కడ వీటికి కూడా చేపట్టాల్సి ఉంటుంది. వారు వెంటనే ఆ పనిని నిలిపివేసి, ఆ ప్రాంతాన్ని సంరక్షించాల్సి ఉంటుంది. నగరవ్యాప్తంగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టడంతో, ఎవరైనా సొరంగాన్ని తవ్వడం మొదలుపెట్టిన వెంటనే తమకు ఒక ఫోన్ వస్తుందని లెవిస్ టీమ్ చెబుతోంది. లెవిస్, ఆమె బృంద సభ్యులు ఈ సొరంగాల పరిమాణాన్ని, లక్షణాలను అంచనావేస్తున్నారు. "మేం సొరంగం లోపలంతా చూసి, కాంట్రాక్టర్లతో, భూయజమానులతో కలిసి ఏం చేయాలన్నదానిపై చర్చిస్తాం. ప్రాజెక్టును డెవలప్ చేస్తూ ఇది దెబ్బతినకుండా ఎలా చూడగలం అన్నది పరిశీలిస్తాం. ఇందుకోసం చాలా కసరత్తు ఉంటుంది." అని అన్నారు. ప్రైవేట్ యజమానులకు తమ ఇళ్ల కింద పురావస్తు అవశేషాలు దొరకడం పెద్ద తలనొప్పిగా మారింది. ఈ బాధంతా పడలేక వాళ్లు ఎవరి తెలియకుండా దాచి పెడుతున్నారు. విషయం తెలిసి పెద్ద ఎత్తున పర్యాటకులు వాటిని చూడటానికి రావడం వారికి నచ్చడం లేదు. మ్యాపింగ్ ప్రాజెక్టు ప్రకటించినప్పటి నుంచి ప్రజల్లో ఆసక్తి పెరుగుతుండటంతో ఈ సొరంగాలున్న ప్రాంతాల పేర్లను ప్రకటించడం లేదు పేర్లు బయటపెడితే భూముల విలువ తగ్గుతుందని కొందరు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఎవరైనా తమ భూమి కింద ఈ సొరంగాలను గుర్తిస్తే, దాన్ని బేస్‌మెంట్‌లాగా మార్చేయడం లేదా స్విమ్మింగ్ పూల్ చేయడమో చేస్తున్నారని లెవిస్ చెప్పారు. సొరంగాన్ని గుర్తించడం కూడా ప్రమాదకరం. కొన్నిసార్లు తవ్వకాలు జరిపే యంత్రాలు ఆ సొరంగాలలో కూరుకుపోతున్న సందర్భాలు కూడా ఉంటున్నాయి. యూరోపియన్లు రాకముందు కొన్ని సొరంగాలను శ్మశాన వాటికలుగా వాడిన స్థానిక మావోరి తెగ "మా దగ్గర హౌసింగ్ సదుపాయాలు చాలా తక్కువగా ఉన్నాయి. వీటిని పెంచుకోవాలి." అని మ్యాపింగ్ ప్రాజెక్టుపై పనిచేస్తున్న ఆక్లాండ్ యూనివర్సిటీలో మాస్టర్స్ స్టూడెంట్ జాక్సన్ ఇన్‌గోల్డ్ తెలిపారు. " కన్‌స్ట్రక్షన్ కొనసాగితే మరిన్ని భవనాలు వస్తాయి. అందుకోసం తవ్వకాలు జరపాలి. అప్పుడు మరిన్ని సొరంగాలు బయటపడే అవకాశం ఉంటుంది." అని అన్నారు. వీటివల్ల నిర్మాణ కార్మికులకు పెద్ద ప్రమాదం లేకపోవచ్చు. కానీ, సొరంగాలపై ఇలాంటి నిర్మాణాలు చేపట్టడం ప్రమాదకరమే." అన్నారు జాక్సన్. "మనుషులు సృష్టించే సమస్యలతో పాటు, భౌగోళిక పరంగా కూడా సమస్యలున్నాయి. ఏ సమయంలోనైనా ఆక్లాండ్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది" అని లెవిస్ చెప్పారు. భవిష్యత్‌లో ఈ ప్రకృతి వైపరీత్యాలను నిర్మూలించేందుకు, నిరంతర పర్యవేక్షణ, అగ్నిపర్వతాల పేలుళ్లకు అవకాశాలను గుర్తించేందుకు డేవోరా (డిటర్‌మైనింగ్ వొల్కానిక్ రిస్క్ ఇన్ ఆక్లాండ్.) ఒక ప్రణాళికను రూపొందించింది. దీనికి ఎర్త్‌క్వేక్ కమిషన్, ఆక్లాండ్ కౌన్సిల్ ) ఇందుకు నిధులు సమకూరుస్తుంది. తర్వాత విస్ఫోటనం ఎప్పుడు వస్తుందో స్పష్టంగా తెలియదు. ఆక్లాండ్‌లోని పలు ప్రాంతాల్లో ఏడు భిన్నమైన పరిస్థితులను వివరించింది. "ఒకవేళ అక్కడ విస్ఫోటనం ఏర్పడితే, అదెలా ఉండబోతుంది? అది ఎటు దారి తీస్తుంది, ప్రజలను తరలించడంలో సమస్యలేంటి, మౌలిక సదుపాయలు ఎలా ఉన్నాయి? వంటి అన్ని విషయాలతో డేవోరా దీన్ని రూపొందించింది. ఆక్లాండ్‌లో లావా సొరంగాలకు చెందిన డేటా బేస్‌ను తొలిసారి రూపొందించడం నగరాన్ని సురక్షితంగా ఉంచేందుకు ఇదొక అవకాశం అవుతుందని చాలామంది భావిస్తున్నారు. భవిష్యత్ ప్రమాదాల నుంచి బయటపడేందుకు ఉపయోగపడనుంది. లావా ఎలా ప్రయాణిస్తుందనే దానిపై మరింత తెలుసుకునేందుకు గత లావా ప్రవాహాలను పరిశీలించడం సాయపడుతుందని ఇన్‌గోల్డ్ తెలిపారు.

# రఫాపై ఇజ్రాయిల్ దాడిని ఆమోదించిన బైడెన్



ఇజ్రాయిల్ గాజాలోని దక్షిణానగల నగరమైన రఫాపై దాడిని సోమవారంనాడు ప్రారంభించింది. జనాభాను ఖాళీ చేయమని ఆదేశాలు జారీ చేసింది. 12 లక్షల కంటే ఎక్కువ మంది శరణార్థులు(వీరిలో 600,000 కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నారు) ప్రస్తుతం రఫాలో తగినంత ఆహారం, నీరు, పరిశుభ్రత లేదా మందులు లేకుండా దుర్భర పరిస్థితులలో ఆశ్రయం పొందుతున్నారు. ఇజ్రాయిల్ సోమవారం గాజా అంతటా నివాస గహాలపై బాంబుదాడి చేసింది. అనేకమంది మరణించారు. వీరిలోఎక్కువగా మహిళలు, పిల్లలు ఉన్నారు. ఎంతోమంది గాయపడ్డారు. మంగళవారం ఇజ్రాయి రఫా సరిహద్దు క్రాసింగ్ను స్వాధీనం చేసుకుని గాజాలోని ఆకలితో అలమటిస్తున్న జనాభాకు కీలకమైన ఆహారాన్ని మూసివేసింది. మంగళవారం ఒక ప్రసంగంలో అధ్యక్షుడు జో బైడెన్ రఫా నగరంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని సమర్థించాడు. పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహౌమాన్ని సమర్థించ డానికి నీచంగా హౌలోకాస్టు ఉపయోగించుకున్నాడు. 'యూదులపై ఈ పురాతన ద్వేషం హౌలోకాస్టో ప్రారంభం కాలేదు ఈ ద్వేషం చాలా మంది వ్యక్తుల హదయాల్లో లోతుగాకొనసాగుతూనే ఉంది%¤% ఆ ద్వేషం అక్టోబర్ 7, 2023న ప్రాణం పోసుకుంది' అని బైడెన్ ప్రకటించాడు. ఐరోపాలో అత్యంత శక్తివంతమైన పెట్టుబడిదారీ రాజ్యమైన నాజీ జర్మనీలో అరవై లక్షలకుపైగా యూదులను హతమార్చిన హౌలోకాస్టు అక్టోబర్ 7 నాటి సంఘటన లతో సమానం చేయడానికి బైడెన్ చేసిన ప్రయత్నం చరిత్రను పూర్తిగా తప్పుదారి పట్టించడమే అవుతుంది. హౌలోకాస్టు, గత ఆరు నెలలుగా జరుగుతున్న సంఘటనలకు మధ్యగల ఏకైక సమాంతరం ఏమిటంటే నాజీ జర్మనీలో యూదులకు వ్యతిరేకంగా జరిగిన మారణకాండను తలపించేలా నేడు యూదు దేశమైన ఇజ్రాయిల్ గాజాలోని పాలస్తీనియన్లను హతమారు స్తోంది. గత 75 సంవత్సరాలలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ చేసిన నేరాలను, ఘోరాలను, హత్యాకాండలను బైడెన్ అసలు పట్టించుకోలేదు. బైడెన్ ప్రసంగం అన్ని ముఖ్యమైన విషయాలలో హౌలోకాస్ట్ స్మారక కార్యక్రమంలో బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం చేసినవ్యాఖ్యలకు అద్దం పట్టింది. రఫాపై దాడి చేసి గాజా మొత్తాన్ని లొంగదీసుకుంటానని ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి ప్రతిజ్ఞ చేశాడు. 'ఎన్ని విభేదాలున్నప్పటికీ ఇజ్రాయిల్ భద్రతకు, స్వతంత్ర యూదు రాజ్యంగా ఉనికిలో ఉండటానికి నేను నిబద్ధుడై ఉన్నాను' అని బైడెన్ మంగళవారం చేసిన ప్రసంగంలో గాజాలో ఇజ్రాయిల్ మారణహోమానికి తన పూర్తి మద్దతును పునరుద్ఘాటించాడు. వాస్తవానికి, రఫా దండయాత్రతో బైడెన్ 'ఏకీభవించలేదు'అనే వాదన అబద్ధం. ఇజ్రాయిల్ పాలన ఏమి చేసినా ఎటువంటి పరిణామాలు ఉండవని బహిరంగంగా ప్రకటించడం ద్వారా గాజా జనాభాను ఊచకోత కోయడానికి వైట్ హౌస్ ఇజ్రాయిల్కు ఒక బ్లాంక్ చెక్ ఇస్తోంది. గాజా మారణహౌమాన్ని బైడెన్ సమర్థించడం, యుద్ధ వ్యతిరేక నిరసనలపై అతని అణిచివేత సెమిటిజం వ్యతిరేకతతో ప్రేరేపించబడిందనే వాదన అబద్ధం. వందలాది నిరసనకారులు బైడెన్ పోలీసు అణిచివేతకు గురయ్యారు. వీరు పోలీస్ లాఠీలను, బాష్పవాయువును, రబ్బరు బుల్లెట్లను ఎదుర్కొన్నారు. అరెస్టు చేయబడ్డారు. వారాంతంలో, న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ గాజా మారణహోమానికి వ్యతిరేకంగా నిరసనలను 'ముగిస్తాము' అని బెదిరించాడు. అయితే సెనేటర్ టామ్ కాటన్నిరసనలను 'చిన్న గాజాలు' అని పేర్కొన్నాడు. పోలీసులు నిరసనకారులను గాజాలో ప్రజలను ఇజ్రాయిల్ పరిగణిస్తున్నట్లుగానే పరిగణించాలని సూచించాడు. మారణహోమానికి వ్యతిరేకతను సెమిటిజం అని నిందించడంలో బైడెన్ జియోనిస్ట్ అబద్ధాన్ని పునరావతం చేస్తున్నాడు. ఇది యూదుల గుర్తింపును ఇజ్రాయిల్కు మద్దతుతో సమానం చేస్తుంది. ఈ మితవాద కథనం ప్రకారం, అమెరికన్ యూదులు వారి మతం ద్వారా నిర్వచించబడి ఇజ్రాయిల్ రాజ్యంతో విడదీయరాని సంబంధంలో ఉంటారు. జియోనిస్ట్ రాజ్యం సామ్రాజ్యవాదం సాధనంగా ఎల్లవేళలా పనిచేస్తోంది. హౌలోకాస్ట్ ను ఉటంకించటం ద్వారా అమెరికా సామ్రాజ్యవాదం యొక్క దోపిడీ ప్రయోజనాలను సమర్థించటానికి బైడెన్చేస్తున్న ప్రయత్నాలను ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నగంగా కనిపిస్తున్న దగాగా భావిస్తున్నారు. మానవ హననాన్ని రాజ్య విధాన సాధనంగా ఉపయోగించటాన్ని 20వ శతాబ్దంలో సాగించిన మారణ హోమాలను పునరావతం చేయాలనే ఉద్దేశంగల ఒక సామ్రాజ్యవాద దేశం బహిరంగంగా ఆమోదించటమే బైడెటన్ ప్రసంగ సారం.

# రేవంత్ సమర్ధతకు పరీక్ష - కీలక మలుపు..!!



తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు హోరా హోరీగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎంపీ సీట్ల పైన ఫోకస్ చేసింది. అసెంబ్లీ తరహాలోనే మెజార్టీ సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ తిరిగి పూర్వ వైభవం కోసం ప్రయత్నిస్తోంది. బీజేపీ ఈ సారి తమ సత్తా చాటుతామని చెబుతోంది. ఇటు పోలింగ్ కోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. మూడు పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి.

## సర్వం సిద్ధం

మరి కొద్ది గంటల్లో తెలంగాణలో ఎంపీ స్థానాలకు పోలింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లుపూర్తి చేసింది. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా 400 కోట్లకు పైగా విలువగల డబ్బు, మద్యం, వస్తువులను సీజ్ చేసింది. ఎన్నికల నిఘా, భద్రత కోసం రాష్ట్ర పోలీసులతో పాటు, 175 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలతో నిఘా పెట్టింది.ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈనెల 13న తెలంగాణలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో మొత్తం 3.32 కోట్ల మంది ఓటర్లు ఉండగా. ఇందులో సగానికి పైగా మహిళా ఓటర్లే ఉన్నారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాలకుగాను 13 నియోజక వర్గాల్లో మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు.

## ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల 809 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్లలో ఎండలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని సూచించింది ఎన్నికల సంఘం. 9,900 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించిన ఎన్నికల సంఘం, అలాంటి ఏరియాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా పెట్టేలా ప్లాన్ చేసింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగనుంది. రాష్ట్రంలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎన్నికల సంఘం.. అలాంటి ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగాలని నిర్ణయించింది. రాష్ట్ర పోలీసులతో పాటు ఎన్నికల విధుల్లో భాగంగా కేంద్రం నుండి 175 కంపెనీలు విధుల్లో ఉండనున్నాయి.

## రాజకీయ ఉత్కంఠ

ఎన్నికల విధుల్లో 2.80 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల్లో వ్యయ పరిశీలకులుగా 14 మందిని నియమించారు. జనరల్ పరిశీలకులుగా 17 మందిని నియమించారు. ఇక హోమ్ ఓటింగ్ కోసం 23,247 మంది ఓటర్లు దరఖాస్తు చేసుకోగా. ఇందులో 21,651 మంది ఓటు వేశారు. ఇక పోస్టల్ బ్యాలెట్ ద్వారా లక్ష 80 వేలకు పైగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలు మూడు పార్టీల కు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. మెజార్టీ సీట్లు సాధించి రేవంత్ తన సమర్ధత నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీజేపీ సైతం ఇక్కడే గురి పెట్టింది. కేసీఆర్ అంచనాలు ఏ మేర నిజం అవుతాయనేది కీలకంగా మారుతోంది. మారుతున్న లెక్కలతో ఎన్నికలు రాజకీయంగా ఉత్కంఠ పెంచుతున్నాయి.

# తమన్నా-రాశి.. గ్లామర్ యుద్ధం





ఆరణ్మయి.. తమిళంలో ఫ్రాంఛైజీగా మారిన హార్రర్ కామెడీ మూవీ. తెలుగులో ఎప్పుడో అరగదీసి పక్కన పడేసిన ఈ జానర్‌ను తమిళ దర్శకులు మాత్రం ఇంకా వదిలిపెట్టట్లేదు. ముఖ్యంగా సీనియర్ దర్శకుడు సుందర్.సి అయితే చాలా ఏళ్లుగా ఈ ఫ్రాంఛైజీని నమ్ముకునే కెరీర్‌ను సాగదీస్తున్నాడు. 'ఆరణ్మయి' హిట్టయినా.. ఆ తర్వాత వచ్చిన సినిమాలేవీ కూడా గొప్ప ఫలితాలేమీ అందుకోలేదు. కానీ సుందర్ మాత్రం అవే కథలను ఇటు అటు తిప్పి సినిమాలు తీస్తూనే ఉన్నాడు. 'ఆరణ్మయి' ఫ్రాంఛైజీలో ఇప్పటికే మూడు సినిమాలు రాగా.. నాలుగో సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ వేసవిలోనే రిలీజ్ పెట్టుకున్నారు. ఈ సినిమాల్లో హార్రర్, కామెడీతో పాటు గ్లామర్ డోస్ కూడా బాగానే ఉంటోంది. ఈ సినిమాలు సేల్ కావడానికి కూడా అదే కారణం. 'ఆరణ్మయి-3'లో రాశి ఖన్నాను చాలా గ్లామరస్‌గా చూపించి యూత్‌ను మెప్పించాడు సుందర్. 'ఆరణ్మయి-4'లోనూ రాశి పాత్రను కొనసాగిస్తున్నాడు. ఆమెకు తోడు మిల్కీ బ్యూటీ తమన్నాను కూడా రంగంలోకి దించాడు సుందర్. వీళ్లిద్దరి గ్లామర్ లుక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒకరిని మించి ఒకరు సెక్సీగా కనిపిస్తున్న ఒక పోస్టర్ యూత్ దృష్టిని బాగా ఆకర్షిస్తోంది. రాశి, తమన్నా ఇద్దరి కెరీర్లూ ఇప్పుడు డల్లుగా నడుస్తున్నాయి. ఇంతకుముందుతో పోలిస్తే వారి రేంజ్ పడిపోయింది. మిడ్ రేంజ్ సినిమాలక పరిమితం అవుతున్నారు. అయినా ఇప్పుడున్న రేంజ్ ఇంకా తగ్గకుంటే చాలన్నట్లు ఉంది పరిస్థితి. అందుకే 'ఆరణ్మయి-4' లాంటి సినిమాలు క్లిక్ అవడం కీలకం. సినిమాలో ఇద్దరూ ఒకరితో ఒకరు పోటీ పడి గ్లామర్ విందు చేసినట్లు కనిపిస్తోంది. మరి ఈ సినిమాకు వారి గ్లామర్ ఏమేర ప్లస్ అవుతుందో చూడాలి.

# 'కల్కి 2898 ఎడి'.. ఆందోళనలో ప్రభాస్ ఫ్యాన్స్?







రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ "కల్కి 2898 ఎడి ". మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సీనియర్ నిర్మాత అశ్వినీ దత్ నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్ తో, హై టెక్నికల్ వాల్యూస్ తో ఈ సినిమాని రూపొందిస్తున్నారు. 2024 మే 9న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే విడుదల దగ్గర పడుతున్నా ఇంకా సెట్స్ మీదే ఉండటం, ప్రమోషన్స్ షురూ చేయకపోవడంతో ఫ్యాన్స్ నిరాశ చెందుతున్నారు. హిందూ పురాణాల ఆధారంగా రూపొందుతున్న ఎపిక్ సోషియో ఫాంటసీ సైన్స్-ఫిక్షన్ డిస్టోపియన్ చిత్రం 'కల్కి 2898 %ాణ%'. ఇది ఇండియన్ సినిమాలో అత్యధిక బడ్జెట్ తో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ ప్రాజెక్ట్. వైజయంతీ మూవీస్ బ్యానర్ లో దాదాపు 600 కోట్ల బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇంటర్నేషనల్ వైడ్ గా తీసుకెళ్లనున్నట్లు మేకర్స్ తెలిపారు. దీనికి తగ్గట్టుగానే శాన్ డియాగో కామిక్-కాన్ ఈవెంట్ లో ఫస్ట్ లుక్, గ్లింప్స్ ను రిలీజ్ చేసి గ్లోబల్ ఆడియెన్స్ దృష్టిని ఆకర్షించారు. 'బాహుబలి' తర్వాత ప్రభాస్ నుంచి వచ్చే ప్రతీ సినిమాపై భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అందులోనూ 'కల్కి 2898 ఎడి' అనేది ఇంతవరకూ ఇండియన్ స్క్రీన్ మీద రాని కథాంశంతో తెరకెక్కుతున్న మూవీ కావడంతో అందరిలో అంచనాలు రెట్టింపు అయ్యాయి. 'సలార్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రాబోతున్న సినిమా కచ్చితంగా బాక్సాఫీస్ ను షేక్ చేస్తుందని, ఆర్ఆర్ఆర్ మరియు కెజియఫ్ చిత్రాల రేంజ్ లో కలెక్షన్లు కొల్లగొడుతుందని అభిమానులు భావించారు. కానీ ఇప్పుడు రిలీజ్ కు 8 వారాలు మాత్రమే ఉన్నా, ఇంకా చిత్రీకరణ పూర్తి చేసుకోలేదు. సోషియో ఫాంటసీ జోనర్ సైన్స్ ఫిక్షన్ మూవీ కాబట్టి, పోస్ట్ ప్రొడక్షన్ కు ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఇవన్నీ ఆలోచించి ఫ్యాన్స్ కాస్త ఆందోళన చెందుతున్నారని తెలుస్తోంది. మామూలుగా ఇలాంటి భారీ చిత్రాలు విడుదలకు మూడు నెలల ముందుగానే షూటింగ్ పూర్తి చేసి, రెండు నెలలు ప్రమోషన్స్ చేసి జనాల్లోకి తీసుకెళ్తుంటారు. ఎస్ఎస్ రాజమౌళి ప్రతీ సినిమాకు ఇదే ఫాలో అవుతుంటారు. సినిమా కోసం ఎంతగా కష్టపడతారో, ప్రమోషన్స్ కు అంతే ప్రాధాన్యతనిస్తారు. 'కల్కి'ని ఇంటర్నేషనల్ లెవల్ లో తీసుకెళ్లాలంటే ఇంకాస్త గట్టిగానే ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. కానీ ఇక్కడ ప్రమోషన్స్ సంగతి పక్కన పెడితే, ఇంకా షూటింగే కంప్లీట్ అవ్వలేదు. ఇటీవలే 'కల్కి 2898 ఎడి' లోని ఓ పాటను ఇటలీలో షూట్ చేశారు. సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న అమితాబ్ బచ్చన్ కూడా చిత్రీకరణ పూర్తి చేశారు. బిగ్ బి తన బ్లాగ్‌లో ఈ అప్‌డేట్ పోస్ట్ చేస్తూ.. మే 9న సినిమాను విడుదల చేయనున్నట్టు మరోసారి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఇంకా కొంత భాగం షూటింగ్ పెండింగ్ ఉండటం వల్ల, అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ రెడీ అవుతుందో లేదో అని డిస్ట్రిబ్యూటర్లు, ట్రేడ్ వర్గాలు సందిగ్ధంలో ఉన్నారని టాక్ నడుస్తోంది. 'కల్కి 2898 ఎడి' సినిమాలో ప్రభాస్ కు జోడీగా బాలీవుడ్ భామలు దీపికా పదుకునే, దిశా పటాని నటిస్తున్నారు. సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ తో పాటుగా విశ్వ నటుడు కమల్ హాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్నార. జోర్జే స్టోజిల్జ్కోవిచ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'తుంబాడ్' ఫేమ్ నితిన్ జిహాని చౌదరి ప్రొడక్షన్ డిజైనింగ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి బయటకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ ను మంచి రెస్పాన్స్ వచ్చింది. మరి ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు క్రియేట్ చేస్తుందో చూడాలి.


# డ్యాన్సులతోనే మత్తెక్కిస్తున్న కృతి సనోన్



1-నేనొక్కడినే సినిమాతో టాలీవుడ్ లో ప్రవేశించిన కృతి సనోన్ ఆ తర్వాత దోచేయ్ సినిమాలో నటించింది. కెరీర్ ఆరంభమే ఫ్లాపులు ఎదురయ్యాయి. లుక్స్ పరంగా అంతంత మాత్రమే అని విమర్శలు ఎదురైనా తనదైన నటప్రతిభతో ఈ భామ మైమరిపించింది. ఇక తెలుగులో ఫ్లాపులు ఎదురయ్యాక కృతి పూర్తిగా బాలీవుడ్ కే అంకితమైంది. అక్కడ వరుసగా హిట్ చిత్రాల్లో నటించింది. ఇటీవలే మిమీ చిత్రంలో నటనకు గాను జాతీయ ఉత్తమ నటిగా అవార్డును అందుకుంది. ఇటీవల 'క్రూ' అనే కామెడీ మూవీలో నటించింది. టబు, కరీనా కపూర్ సహా కుర్ర బ్యూటీ ప్రధాన పాత్రను పోషిస్తోంది. ముగ్గురూ ఇందులో ఎయిర్ హోస్టెస్‌లుగా కనిపిస్తున్నారు. అయితే వీళ్లు దొంగతనాలు చేస్తూ గ్లామర్ ని ఒలకబోస్తూ చేస్తున్న రచ్చ మామూలుగా లేదు. ఈ బ్యూటీ 'నైనా..' సాంగ్ లో అద్భుతమైన నృత్యాలు చేసింది. దీనికి సంబంధించిన ఒక వీడియో అంతర్జాలంలో వైరల్ గా మారింది. తనదైన సొగసును ఆవిష్కరిస్తూ.. ఒంపుసొంపులను ఆరబోస్తూ.. నైనా ఈ పాటలో కృతి మెరుపులు మెరిపించింది. తన డ్యాన్సింగ్ శైలితో ఆకర్షించింది. దీంతో పాటు అందచందాలను యువతరం తథేకంగా గమనించేంతగా ఆకర్షిస్తోంది కృతి. ఈ భామలో గ్లామర్ డోస్ అమాంత పెరిగినట్టే కనిపిస్తోంది. కృతి గ్లామ్ లుక్ కి యూత్ ఫిదా అయిపోతున్నారు. క్రూ త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇందులో ముగ్గురు భామల గ్లామర్ ట్రీట్ కోసం యూత్ ఉత్కంఠగా వేచి చూస్తోంది.



# అందానికి కొత్త చిరునామా..!



ఇష్టం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన శ్రియా శరణ్ దాదాపు 22 ఏళ్ల నుంచి తెలుగుతో పాటుగా సౌత్ అన్ని భాషల్లోనే కాదు బాలీవుడ్ లో కూడా తన సత్తా చాటుతూ వచ్చింది. అన్ని భాషల్లో స్టార్ హీరోలందరితో కలిసి నటించిన శ్రియా శరణ్ అన్నిచోట్ల స్టార్ స్టేటస్ అందుకుంది. కెరీర్ లో టాప్ ప్లేస్ కి వెళ్లిన అమ్మడు తన మార్క్ నటనతో ఆడియన్స్ ని మెప్పిస్తూ వచ్చింది. కెరీర్ లో అవకాశాలు సన్నగిల్లాయి అనుకున్న టైం లో స్పెషల్ సాంగ్స్, క్యామియో రోల్స్ కూడా చేస్తూ వచ్చింది ఈ అమ్మడు. 2018 లో ఆండ్రీ కొస్చీవ్ ని పెళ్లాడిన శ్రియ శరణ్ పెళ్లి తర్వాత సినిమాల వేగం తగ్గించినా సోషల్ మీడియాలో దూసుకెళ్తుంది. హస్బెండ్ తో పబ్లిక్ లిప్ లాక్, ఘాటు ఫోజులతో సోషల్ మీడియా ఫాలోవర్స్ ని అలరిస్తున్న శ్రియ శరణ్ రోజు రోజుకి ఆ డోస్ పెంచుతూ వచ్చింది. పెళ్లై ఒక పాపకి తల్లైనా కూడా శ్రియ గ్లామర్ షో విషయంలో ఎక్కడ తగ్గట్లేదు. గ్లామర్ ఫీల్డ్ లో తమని తాము ఎప్పటికప్పుడు అందంగా ఎక్స్ పోజ్ చేసుకోవాలన్న రూల్ ని పర్ఫెక్ట్ గా ఫాలో అవుతుంది శ్రియా శరణ్. అందుకే కొత్త హీరోయిన్స్ చేసే ఫోటో షూట్స్ కన్నా శ్రియ శరణ్ ఫోటో షూట్స్ కి స్పెషల్ క్రేజ్ ఏర్పడుతుంది. లేటెస్ట్ గా మరోసారి శ్రియ తన ఫోటో షూట్స్ తో మెస్మరైజ్ చేస్తుంది. శారీ లుక్ లో ఎక్కడ కవర్ చేయాలి ఎక్కడ ఓపెన్ చేయాలి అనేది పర్ఫెక్ట్ గా ప్లాన్ చేసి ఫోటో షూట్స్ షేర్ చేసింది శ్రియ శరణ్. అందానికి సరికొత్త చిరునామాగా శ్రియ చేసిన ఈ ఫోటో షూట్ ఆడియన్స్ ని డిస్టర్బ్ చేస్తున్నాయని చెప్పొచ్చు. శారీలో కూడా ఇలా క్రేజీ హాలిలిట్ అప్పీల్ చేయొచ్చని శ్రియని చూసే నేర్చుకోవాలి. ఇక అమ్మడి సినిమాల విషయానికి వస్తే లాస్ట్ ఇయర్ కన్నడలో కబ్జా సినిమా చేసిన శ్రియ హిందీ తెలుగు బైలింగ్వల్ మూవీగా మ్యూజిక్ స్కూల్ సినిమా చేసింది. హిందీ టీవీ సీరీస్ షో టైం లో కూడా నటించింది శ్రియ శరణ్. ఈ రేంజ్ ఫోటో షూట్స్ తో అలరిస్తున్న అమ్మడికి మళ్లీ లీడ్ రోల్ ఛాన్స్ వచ్చినా వచ్చేస్తాయని చెప్పొచ్చు. ఏది ఏమైనా పెళ్లై ఒక బేబీ ఉన్నా కూడా శ్రియ గ్లామర్ మెయింటెనెన్స్ మాత్రం నెక్స్ట్ లెవెల్ అని చెప్పొచ్చు.